Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 సంచిక : 264 పేజీలు 8 వెల : 5 ఫిబ్రవరి 28 శుక్రవారం 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ
ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

| తారీఫ్ | బ్లాక్ & వైట్ పేజి |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఫ్రంట్ పేజి : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

# సరస్వతి పవర్‌లో వాటాలన్నీ నావే

**సరస్వతి పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ వాటాల బదలాయింపులోకి షర్మిలను అనవసరంగా లాగుతున్నారని.. జగన్, భారతిరెడ్డి ట్రైబ్యునల్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌కు వైఎస్ విజయమ్మ నివేదించారు.**



హైదరాబాద్‌జగన్, భారతిలకు సరస్వతిలో ఉన్న వాటాలన్నీ నా పేరిట బదిలీ అయ్యాయి. ప్రస్తుతం వారికి వాటాలేవీ లేవు. అందువల్ల ట్రైబ్యునల్‌లో పిటిషన్ వేసే అర్హత వారికి లేదు.విజయమ్మసరస్వతి పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ వాటాల బదలాయింపులోకి షర్మిలను అనవసరంగా లాగుతున్నారని.. జగన్, భారతిరెడ్డి ట్రైబ్యునల్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌కు వైఎస్ విజయమ్మ నివేదించారు. సరస్వతి లిమిటెడ్‌తో గానీ, గిఫ్ట్‌డీడ్‌తో గానీ షర్మిలకు సంబంధం లేదని, అయినా తన కుమారుడు జగన్, కోడలు భారతిరెడ్డి.. షర్మిలను వాటాల బదలాయింపు వివాదంలోకి లాగుతున్నారన్నారు. జగన్‌కు, షర్మిలకు ఉన్న ఆస్తి వివాదాలను ఇక్కడ తీసుకురావడం ట్రైబ్యునల్‌ను తప్పుదోవ పట్టించడానికేనన్నారు. సరస్వతి వాటాలపై సర్వహక్కులు తనవేనని, వారిద్దరి ఆస్తి వివాదాలతో నన్ను కోర్టులో నిలబెట్టారని పేర్కొన్నారు. పిల్లల మధ్య వివాదంతో ఏ తల్లీ కోరుకోని విధంగా నిస్సహాయంగా కోర్టులో నిలబడాల్సి వచ్చిందని.. తనను ఇంత ఆవేదనకు గురిచేయడం జగన్, భారతిలకు సరికాదన్నారు. సరస్వతి వాటాల కొనుగోలు, గిఫ్ట్‌డీడ్ ద్వారా వచ్చిన వాటాలన్నీ చట్టప్రకారం తన పేరిట బదలాయించారని, షర్మిల భవిష్యత్తు ప్రయోజనాల కోసం గిఫ్ట్‌డీడ్‌ను తనపై విశ్వాసంతో చేసి ఇచ్చాననడం అవాస్తవమని పేర్కొన్నారు. ప్రస్తుతం సరస్వతిలో జగన్, భారతిలకు వాటాలేమీ లేవని, ఇందులో 99.75% వాటాలు తనవేనని విజయమ్మ స్పష్టం చేశారు. కుటుంబవివాద అవగాహన పత్రం ఆధారంగా కంపెనీ చట్టం కింద జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు వేసిన పిటిషన్లు చెల్లుబాటు కావని, భారీ జరిమానాతో కొట్టేయాలని కోరారు. సరస్వతిలో అనుమతి లేకుండా జరిగిన వాటాల బదలాయింపును నిలిపివేయాలని, వాటాదారుల రిజిస్టర్‌లో పేర్లను మార్చి తన వాటాను పునరుద్ధరించాలని కోరుతూ జగన్, భారతిరెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌లో ప్రతివాదిగా ఉన్న విజయమ్మ కౌంటరు దాఖలు చేశారు. విజయమ్మ పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి.

**వ్యక్తిగత వివాదాలతోనే పిటిషన్**

జగన్‌కు, షర్మిలకు మధ్య ఉన్న రాజకీయ, వ్యక్తిగత వివాదాల కారణంగానే ఈ పిటిషన్ దాఖలుచేశారని విజయమ్మ పేర్కొన్నారు. ఇందులో భాగంగా సెక్షన్ 59ను తప్పుగా అన్వయిస్తున్నారని తెలిపారు. జగన్‌కు, షర్మిలకు విభేదాలున్నా ఈ కంపెనీ పిటిషన్‌కు దాంతో సంబంధం లేదన్నారు. చట్టప్రకారం కార్పొరేట్, వాటాదారుల హక్కులకు సంబంధించిన సెక్షన్ 59ను వ్యక్తిగత కక్ష సాధింపులకు వినియోగించరాదని పేర్కొన్నారు. సరస్వతిలోని 46.71 లక్షల వాటాలను సండూర్ కంపెనీ, 71.50 లక్షల వాటాలను క్లాసిక్ రియాల్టీ తనకు విక్రయించడంతో మొత్తం 1.21 కోట్ల ఈక్విటీ వాటాలతో 48.99% దక్కించుకున్నానన్నారు. 2021 జులై 26న జగన్, భారతి రెండు దానపత్ర ఒప్పందాలు (గిఫ్ట్‌డీడ్) తనకు చేసి ఇచ్చారన్నారు. వీటి ప్రకారం సరస్వతిలో జగన్‌కు చెందిన 74.26లక్షల వాటాలు, భారతికి చెందిన 40.50 లక్షల వాటాలను తనకు బదిలీచేసినట్లు తెలిపారు. గిఫ్ట్‌డీడ్‌లో వాటా సర్టిఫికెట్ల ఫోలియో నంబర్లను కూడా పేర్కొన్నారని చెప్పారు. తనతో క్లాసిక్ రియాల్టీ 2021 జులై 23న వాటా కొనుగోలు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఈ వ్యవహారంలో క్లాసిక్ రియాల్టీ, సరస్వతి పవర్, తాను మాత్రమే పార్టీలుగా ఉంటామన్నారు. సరస్వతి పవర్‌లోని 11.37 లక్షల వాటాలను రూ.3.07 కోట్లకు క్లాసిక్ రియాల్టీ తనకు బదిలీ చేసిందన్నారు. వాటాలను తన పేరుతో బదలాయించాలంటూ గత ఏడాది జూన్ 14న సరస్వతి కంపెనీకి రాసిన లేఖ ఆధారంగా అన్ని అంశాలనూ పరిశీలించి తనపేరుతో బదలాయించిందని తెలిపారు. ఈ విషయాన్ని గత ఏడాది జులై 2న బోర్డు సమావేశంలో ఉంచగా డైరెక్టర్లు బదలాయింపునకు ఆమోదం తెలిపారన్నారు. దీంతో కంపెనీ సభ్యుల జాబితాలో తన పేరు నమోదైందని చెప్పారు. వాటాల బదలాయింపు, తన హక్కుల గురించి ప్రశ్నించడానికి కారణాలు లేవన్నారు. ఇప్పుడు కంపెనీలో 99.75% వాటా పొందానని స్పష్టం చేశారు.

## నేడు ఎపి కేబినేట్ భేటీ బడ్జెట్‌కు లాంఛనంగా ఆమోదం



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను చంద్రబాబు సర్కార్ ప్రవేశ పెట్టనుంది. ఎన్నికలు ముగిసిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. ఇందులో భాగంగా శుక్రవారం జరిగే కేబినేట్ సమావేశం బడ్జెట్‌కు లాంఛనంగా ఆమోదం తెలుపనుంది. ఈ మేరకు ఉదయం 9 గంటలకు ఏపీ కేబినేట్ సమావేశం జరగనుంది. ఈ మంత్రి మండలి సమావేశంలో దీనికి ఆమోదం తెలువుతుంది. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు శాసన సభలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టనున్నారు. కౌన్సిల్ లో మంత్రి కొల్లు రవీంద్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టనుండగా.. వ్యవసాయ బ్జడెట్ ను మంత్రి పొంగూరు నారాయణ ప్రవేశ పెట్టనున్నారు.



## కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యం

ఇరు రాష్ట్రాలు జాగ్రత్తగా వాడుకోవాలి

కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం

2వ



## హిందీ రుద్దడంతో స్థానిక భాషలు సర్వనాశనం

భోజ్‌పురి, బుందేల్ లాంటి భాషలు కనుమరుగు

మరోమారు హిందీపై అక్కసు వెళ్లగక్కిన స్టాలిన్

2వ



## ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో ప్రభుత్వం

నీటిని తరలించుకుపోతున్నా పట్టించుకోని వైపనం

సారంగం పనుల్లో కానరాని పురోగతి

ఆందోళనకు దిగిన బిఆర్ఎస్..అడ్డుకున్న పోలీసులు

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

## బెంగాల్లో దొంగ ఓట్లను చేర్పించిన బిజెపి



ఇసి సహకారంతో నకిలీ ఓటర్లను చేర్పించారు

వీటిని తొలగించకుంటే ..ఇసి ముందు ధర్నా చేస్తాం

బెంగాల్ సిఎం మమతా బెనర్జీ హెచ్చరిక

2వ

## మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా



కేంద్రాన్ని అడిగి ఎన్నికల హామిలు ఇచ్చారా

సిఎం రేవంత్ స్థాయిని మరిచి విమర్శలు

మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2వ



## వ్యాక్సిన్ దుష్ప్రభావంతో చనిపోయిన వారి సంగతేంటి

వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలి

సుప్రీం ధర్మాసనం సూటి ప్రశ్న

2వ



## రెండుమూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం

సహాయక చర్యల పూర్తికి యుద్ధప్రాతిపదికన చర్యలు

జగన్‌తో అంటకాగి నీటి చౌర్యానికి సహకరించిన బిఆర్ఎస్

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి

# తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

### 3న ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన

**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఆంధ్రప్రదేశ్ లో 3, తెలంగాణలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే, సాయంత్రం 4 గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఏపీలో 2 గ్రాడ్యుయేట్, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్ సమయం ముగిసే నాటికి పశ్చిమ గోదావరి జిల్లాలో 65.43 శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాటు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖపట్నం జిల్లాలో 87.30 శాతం పోలింగ్ నమోదు అయింది. ఎన్‌టీఆర్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 61.99 శాతం నమోదు అయింది. మరోవైపు, తెలంగాణలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ముగిసింది. ఉమ్మడి కరీంనగర్- మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 40.61 శాతం, ఇవే జిల్లాల్లో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 63.49 శాతం పోలింగ్ నమోదు కాగా, వరంగల్- నల్లగొండ- ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 76.35 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తెలిపారు. కాగా, వచ్చే నెల 3వ తేదీన తుది ఫలితాలను ఎన్నికల కమిషన్ వెల్లడించనుంది.



# ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో ప్రభుత్వం



నాగర్‌కర్నూలు: ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వలేదన్నారు. 'సహాయక చర్యలకు ఇబ్బంది అవుతుందని ఇన్ని రోజులు రాలేదు. ఆరు రోజులు గడిచినా చిక్కుకుపోయిన వారి ఆచూకీపై ఇప్పటికీ స్పష్టత లేదని అన్నారు. వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,300 కోట్లు ఖర్చు పెడితే.. భారాస ప్రభుత్వం రూ.3,900 కోట్లు ఖర్చు చేసింది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఆపటం లేదన్నారు. రాష్ట్ర ప్రాజెక్టులను కేంద్ర బోర్డుకు అప్పగించేందుకు ఆనాడు భారాస ప్రభుత్వం అంగీకరించ లేదన్నారు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే కాంగ్రెస్ సర్కారు నోరెత్తటం లేదు. కృష్ణా జలాలపై మేం నిలదీసిన తర్వాత కేఆర్ఎంబీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇదిలావుంటే బిఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున మందీమార్బలంతో టన్నెల్ వద్దకు రావడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే ఆరు రోజుల తర్వాత తీసింది కేవలం ట్టటెడు మట్టి మాత్రమేనని హరీష్ రావు అన్నారు. 8 మంది ప్రాణాలు కాపాడటం పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా.. అన్నారు. కాంగ్రెస్ సర్కార్ అవినీతి, నిర్లక్ష్యంతో 15 నెలల్లోనే 4 ప్రాజెక్టులు కూలిపోయినయ్. ప్రమాద ఘటనలో చిక్కుకున్న 8 మంది కార్మికుల ప్రాణాలు కాపాడే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆరు రోజులైనా ఇప్పటి వరకు సరైన డైరెక్షన్ లేదు. మంత్రులు పొద్దున వస్తున్నారు.. సాయంత్రం పోతున్నారు.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఏమైనా టూరిస్ట్ ప్లేసా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇక ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం ఆపడం లేదు.రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆయన వెంట మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, శ్రీనివాసగౌడ్, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## రెండుమూడు నెలల్లో టన్నెల్ పనుల పునఃప్రారంభం



హైదరాబాద్: రెండు, మూడు నెలల్లో ఎస్-ఎల్‌బీసీ టన్నెల్ పనులు పునః ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.రెండు మూడు రోజుల్లో సహాయక చర్యలు పూర్తి చేస్తామని అన్నారు.. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ అనుమతుల గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. ఆప్పుడు మాట్లాడని నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఎందని విమర్శించారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలు పూర్తి అబద్ధాలు, గొబెల్స్ ప్రచారమేనని విమర్శించారు. ఎస్ఎల్బీసీ ద్వారా 30 టీఎంసీలు గ్రావిటీ ద్వారా వస్తుంటే బీఆర్ఎస్ నేతలె పనులు వదిలిపెట్టి వెళ్లారని చెప్పారు. వాళ్లు సరైన పని చేసి ఉంటే తెలంగాణలో 30 టీఎంసీలు నీళ్లు వచ్చి మూడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు సాగులోకి వచ్చేవని అన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదాన్ని అందరికీ చూడటానికి అనుమతిస్తున్నామని చెప్పారు. వారి హయాంలో ఎన్ని ప్రమాదాలు జరిగినా ప్రతిపక్షంలో ఉన్న తమకు ఎలాంటి అనుమతులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వాళ్ల హయాంలో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు పనులు చేశారని మండిపడ్డారు. వాళ్ల హయాంలో నీటిపారుదుల శాఖను నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్, హరీష్ రావులకు దక్కుతుందని చెప్పారు. తాము ప్రజాస్వామ్యతంగా పారదర్శకంగా ముందుకు పోతున్నామని చెప్పారు. వాళ్లు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం బ్లాస్ట్ జరిగి.. 9 మంది చనిపోతే ఒక్కరూ కూడా ఎందుకు పరామర్శకు రాలేదని ప్రశ్నించారు. ఆరోజు రేవంత్ రెడ్డి వస్తుంటే కారులో అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారని గుర్తుచేశారు. దేవాదులలో ఏడు మంది చనిపోతే.. ఆస్తిపంజరాలు ఐదేళ్ల తర్వాత దొరికాయని చెప్పారు. అప్పుడు హరీష్ రావు ఎప్పుడైనా ఆ విషయం గురించి మాట్లాడావా అని నిలదీశారు. ఎన్నో ప్రమాదాలు జరిగినప్పుడు వారి హయాంలో అడిగే నాథుడే లేరన్నారు. ఇక్కడికి వచ్చి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మీరు జగన్‌తో కుమ్మక్కై ప్రగతిభవన్‌లో విందులు, వినోదాలు చేసుకుంటుంటే జగన్ కృష్ణానదిని దోచుకువెళ్లారని విమర్శించారు.. పాలమూరు రంగారెడ్డిలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ. 27,500 కోట్లు ఖర్చుపెట్టి ఒక ఎకరాకు కూడా నీరందించలేదని ధ్వజమెత్తారు.
ఎస్ఎల్‌బీసీకి కరెంట్ కట్ చేస్తే డీ ఓటరింగ్ చేయలేక పనులు ఆగిపోయాయని చెప్పారు. అప్పుడు జగదీశ్ రెడ్డి మంత్రిగా ఉన్నాడు ఏమి చేశారని ప్రశ్నించారు. తనకు హెలికాప్టర్‌లో తిరగాలని తనకు ఏ మాత్రం లేదని..తాను గతంలో పైలట్‌ను అని గుర్తుచేశారు. భారతదేశంలో టన్నెల్ ప్రమాదాల్లో అత్యంత నిపుణులను కలిగిన 11 ఏజెన్సీలను తీసుకువచ్చి సమర్థవంతంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పిన మాటలు అబద్దాలు అని.. ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.

## వ్యాక్సిన్ దుష్ప్రభావంతో చనిపోయిన వారి సంగతేంటి

**న్యూఢిల్లీ:** కోవిడ్ వ్యాక్సినేషన్ దుష్ప్రభావాల కారణంగా చనిపోయిన వారికి పరిహారంపై కేంద్రం స్పందించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న దేశ ప్రజల్లో కొందరు టీకా పడకపోవడంతో దుష్ప్రభావాల కారణంగా చనిపోయారు. ఇలా చనిపోయిన వారి బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించేందుకు కేంద్రం ఏదైనా పాలసీ చేసిందో.. లేదో చెప్పాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిని అడిగింది. కోవిడ్-19 వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత తన భర్త ఆరోగ్యం క్షీణించి చనిపోయాడని, తనకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కేరళకు మిసెస్ సయ్యద్ సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ సుప్రీంలో విచారణకొచ్చిన సందర్భంలో ఎక్స్‌గ్రేషియాపై కేంద్రం స్పందించాలని ఆదేశించింది.కరోనా సమయంలో?ఎమ్జ్గ÷న్సీ పేరుతో క్లినికల్ ట్రయిల్స్ లేకుండానే కొవిషీల్డ్ వ్యాక్సిన్‌కు కేంద్రం అనుమతి ఇచ్చిందని, దీంతో వ్యాక్సిన్ వేసుకున్న వారిలో దుష్ప్రభావం ఇప్పటికీ ఉందని అవేకెన్ ఇండియా మూమెంట్ ఆరోపించిన సంగతి తెలిసిందే. కొవిషీల్డ్ వ్యాక్సిన్ వేసుకున్న వారిలో గుండెపోటు, క్యాన్సర్, నరాల వ్యాధులు వంటివి వస్తున్నాయని అవేకెన్? ఇండియా మూమెంట్ ప్రతిధులు ఆరోపించారు. ఇప్పటికే చాలామంది మృతి చెందారని, వారికి కేంద్ర ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ?తయారీ సంస్థ నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వంతో పాటు వ్యాక్సిన్ ను ?ప్రమోట్? చేసిన సెలబ్రెటీలు కూడా సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

## మెట్రోను అడ్డుకున్నట్లు రుజువు చేస్తారా

**న్యూఢిల్లీ**: ఎవరిని అడిగి ఎన్నికల హామీలు ఇచ్చారు...ఎవరిని మీరు విమర్శిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మెట్రో రెండోదశను అడ్డుకున్నట్లు రుజువులు చూపాలని సవాల్ చేశారు. విస్తరణకు పైసా లేకున్నా పనులు ఎలా చేపడతారని కూడా ఎదురు ప్రశ్నించారు.
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు. తెలంగాణకు సిఎం రేవంతా లేక తానా అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మైనింగ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. గనుల శాఖలో నూతన పాలసీ తీసుకొచ్చామని.. 12 ఖనిజాల రాయల్టీని పెంచామని తెలిపారు. ఈ ఏడాది జీఎస్ఐ 448 ప్రాజెక్టుల్లో గనుల అన్వేషణ చేపట్టిందని పేర్కొన్నారు. గనుల అన్వేషణలో ప్రైవేట్ రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తున్నామని.. ఇందులో భాగంగానే ఈ ఏడాది 12 ప్రైవేట్ కంపెనీలు గనుల అన్వేషణలో భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఆఫ్ షోర్ ఏరియాలో ఖనిజాల ఉత్పత్తిని పెంచుతున్నామన్నారు. పలు ఆఫ్ షోర్ మినరల్స్ గుర్తించి వేలం వేయబోతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 103 బ్లాకుల గనులను వేలం వేశాయని.. ఈ వేలం ప్రక్రియలో 14 రాష్ట్రాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్??పై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డే అడ్డుకున్నారు.

# బెంగాల్లో దొంగ ఓట్లను చేర్పించిన బిజెపి



**కోల్‌కతా:**పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం సాయంతో ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో భాజపా చేర్చుతోందని దుయ్యబట్టారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతానని హెచ్చరించారు. తృణమూల్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన దీదీ భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘాన్ని కూడా భాజపా ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. 2006లో భూసేకరణ వ్యతిరేక ఆందోళనల క్రమంలో చేపట్టిన 26 రోజుల నిరాహార దీక్షను ఆమె గుర్తుచేశారు. ఓటర్ల జాబితాను సరిచేసి, తప్పుడు ఓటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈసీ కార్యాలయం ముందు దీక్ష చేపడతానని అన్నారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు హరియాణా, గుజరాత్ ఓటర్లను తమ రాష్ట్ర జాబితాలో చేర్చుతోందని మమతా బెనర్జీ ఆరోపించారు. దిల్లీ, మహారాష్ట్రల్లోనూ భాజపా ఈ తరహా వ్యూహాలను అమలు చేసిందన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తే విజయం సాధించలేమని భాజపాకు తెలుసునని, అందుకే తప్పుడు జాబితాను రూపొందించే పనిలో పడిందన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇక్కడ రావని, బయట వ్యక్తులు (భాజపా) బెంగాల్‌ను స్వాధీనం చేసుకోవడాన్ని తాము అనుమతించబోమన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు 215 చోట్ల విజయం సాధిస్తామని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

## కృష్ణాజలాల్లో తాగునీటికే ప్రాధాన్యం

**హైదరాబాద్:** తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు రాష్ట్రాల్లో ఉన్న పంటలను దృష్టిలో ఉంచుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ఛైర్మన్ అతుల్ జైన్ నేతృత్వంలో బోర్డు ప్రత్యేక సమావేశం హైదరాబాద్ జలసౌధలో జరిగింది. తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు సమావేశానికి హాజరయ్యారు. రెండు జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకునే విషయమై సమావేశంలో చర్చించారు. మే నెలాఖరు వరకు తమకు 63 టీఎంసీలు కావాలని తెలంగాణ, 55 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సీఈల సమావేశం అనంతరం వివరాలు సమర్పించాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీస వినియోగ మట్టానికి ఎగువన 60 టీఎంసీలకు పైగా నీరు ఉంది. ఉన్న కొద్ది పాటి నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని బోర్డు రెండు రాష్ట్రాలకు సూచించింది. తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన నీటిని ప్రణాళికతో వాడుకోవాలని తెలిపింది. పక్షం రోజులకు ఒకసారి పరిస్థితులను సమీక్షించుకుంటూ ముందుకెళ్లాలని సూచించింది.

# హిందీ రుద్దడంతో స్థానిక భాషలు సర్వనాశనం

చెన్నై: ఏకపక్షంగా హిందీ భాష విధింపుతో ప్రాచీన భాషలు ఉనికిలేకుండా పోతున్నాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బలవంతంగా హిందీని రుద్దడం వల్ల 100 ఏళ్లనాటి 25 భాషలు నాశనమయ్యాయని గురువారం నాడిక్కడ అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్‌లు హిందీ రాష్ట్రాలు కావని, ఆయా రాష్ట్రాలకు చెందిన వాస్తవ భాషలు ఇప్పుడు గతానికి సంబంధించినవిగా మారాయని అన్నారు. హిందీ యుపి మాతృభాష కాదని, ఆ రాష్ట్ర ప్రాచీన భాషలైన భోజ్‌పురి, బుందేల్‌ఖండి (బుందేలీ) భాషలను కోల్పోయిందని అన్నారు. ఉత్తరాఖండ్ కుమావోనిని కోల్పోయిందని, రాజస్థాన్, హర్యానా, బీహార్, ఛత్తీస్‌గఢ్‌లలో స్థానిక భాషల ఉనికి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతిని, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడికి దిగుతోందని మోడీ ప్రభుత్వానికి చురకలంటించారు. తమిళం పట్ల ప్రధాని మోడీకి గౌరవం ఉందన్న వ్యాఖ్యలపై ఉత్తరప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లో బుధవారం ముగిసిన కుంభమేళాలో, తమిళ సంగమం (వారణాసిలో) సమయంలో హిందీయేతర భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. హిందీని విధించడంపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తారు. ఏ రాష్ట్రంలోనైనా పాఠశాల విద్యార్థులు ఏ భాషనైనా నేర్చుకోవచ్చని సూచిస్తున్నారు. కానీ వాస్తవానికి తమిళాన్ని ఓ స్జబెక్టుగా అందించడం లేదని అన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా ఫార్ములా ప్రకారం అన్ని రాష్ట్రాలు సంస్కృతానికి ప్రాధాన్యత ఇస్తాయని అన్నారు. ద్రావిడ ఉద్యమం ద్వారా మాత్రమే తమిళం రక్షించబడుతుందని అన్నారు. అండమాన్‌లో తప్ప ఎక్కడా తమిళం నేర్పడం లేదని, కేంద్రీయ విద్యాలయాల్లో తమిళ భాషా ఉపాధ్యాయులు లేరని అన్నారు. పాఠశాలల్లో కనీసం 15 మంది విద్యార్థులు తమిళాన్ని ఎంచుకుంటేనే ఉపాధ్యాయులను నియమిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి చెప్పారని అన్నారు. రాజస్థాన్‌లోని పాఠశాలల్లో ఉర్దూ స్థానంలో సంస్కృత ఉపాధ్యాయులను నియమించారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా, తమిళనాడు లోని అధికార డీఎంకేల మధ్య హిందీ భాష విషయంలో మాటల యుద్ధం నడుస్తోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఇలా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. '100 ఏళ్లలో ఉత్తర భారతంలో 25 భాషలు కనుమరుగయ్యాయి. భోజ్‌పురి, మైథిలీ, బుందేలీ, గర్వాలీ, కుమావోని, మాగాహి, మార్వారీ, మాల్వీ, ఛత్తీస్‌గఢి, సంథాలీ, అంజికా ఇలా అనేక భాషలు మనుగడ కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. తమిళనాడుకు అలాంటి పరిస్థితి రాకూడదనే ప్రతిఘటిస్తున్నాం. జాతి, సంస్కృతిని నాశనం చేయడానికి భాషలపై దాడి చేస్తున్నారు' అని
స్టాలిన్ రాసుకొచ్చారు. తాము ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.మరోవైపు.. భాజపా, డీఎంకేల మధ్య వివాదం చిన్నపిల్లల కొట్లాటలా ఉందంటూ తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ వ్యాఖ్యానించారు.

## నోరుంది కదాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా ?

మచిలీపట్నం: చట్టబద్ధంగానే పోసాని కృష్ణమురళి అరెస్ట్ జరిగిందని, గతంలో ఆయన మాట్లాడిన తీరును రాష్ట్ర ప్రజలు ఎవరూ మరచిపోరని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నోరు ఉంది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఇలానే ఉంటుందన్నారు. ఆడబిడ్డలపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ క్షమించమని.. ఆడబిడ్డల సంరక్షణ, సమాజ శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. సినీ రచయిత, నటుడు, వైఎస్సార్‌సీపీ నేత పోసాని కృష్ణ మురళీ అరెస్టు పై
స్పందించిన ఆయన మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ.. అధర్మంగా, దుర్గార్గంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరినీ ధర్మం శిక్షిస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లను పోసాని ఇష్టం వచ్చినట్టు మాట్లాడి దూషించాడని, ఇంట్లో ఉన్న ఆడ బిడ్డల గురించి కూడా చాలా అసహ్యంగా మాట్లాడాడని మంత్రి మండిపడ్డారు. సోషల్ మీడియాలో ఆడబిడ్డలపై అనుచిత పోస్టులు పెట్టే ఏ ఒక్కరినీ ఉపేక్షించమని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు రక్షణ
కల్పించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటోందని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయాలనుకుంటే అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అందరినీ లోనికి పంపించేవాళ్లమని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధం గానే కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. వైసీపీ నేతలు చేసిన పాపాలే వాళ్లని వెంటాడు తున్నాయని, కూటమి పాలనలో ప్రజలంతా సంతోషంగా, ఆనందంగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# శరవేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

**విజయనగరం:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు ముమ్మరంగా
సాగుతున్నాయి. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగిన సూచనలు చేస్తున్నారు. సిఎం చంద్రబాబు కూడా త్వరగా దీనిని పూర్తి చేసేలా ఆదేశ్వాలు ఇస్తున్నారు. మొదటి విడత కింద రూ.4,650 కోట్లతో జీఎమ్మార్ సంస్థ ఈ పనులు చేపట్టింది. 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని ఆ సంస్థ ప్రకటించినా, జనవరి నాటికే పూర్తి చేయించాలన్న సంకల్పంతో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోంది. ఎన్‌హెచ్16 నుంచి విమానాశ్రయం వరకు అనుసంధాన రహదారికి భోగాపురం మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో 60.08 ఎకరాలు సేకరించారు. ఇందులో 20.22 ఎకరాలకు పరిహారం చెల్లించారు. సవరవిల్లి పరిధిలో 39.86 ఎకరాలకు సంబంధించి 45 మందికి చెల్లించాల్సిన రూ.19.89 కోట్ల పరిహారాన్ని న్యాయస్థానంలో డిపాజిట్ చేశారు. ప్రత్యామ్నాయ రోడ్లకు రావాడ, కవులువాడల్లో 3.13 ఎకరాల తీసుకుని 0.78 ఎకరాలకు రూ.47.84 లక్షలు చెల్లించారు. రూ.3.19 కోట్లు చెల్లించాల్సి ఉంది. ముంజేరు వద్ద ల్యాండ్ పార్శిల్-1 వరకు రోడ్డు నిర్మాణానికి 1.11 ఎకరాలను గత నెలలో రైతులు అప్పగించగా, వారికి రూ.71.25 లక్షల పరిహారం చెల్లించాలి. బసవపాలెం వద్ద విమానాశ్రయం సిబ్బంది నివాస గృహ సముదాయం నిర్మాణానికి 24.30 ఎకరాలు గుర్తించారు. మరోవైపు 132/33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణానికి 4.50 ఎకరాలు సేకరించగా, అందుకోసం ప్రభుత్వం రూ.70.21 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయం వరకు ట్రంపెట్ నిర్మాణానికి 19.75 ఎకరాలు సేకరించారు. వాటికి పరిహారంగా రూ.14.43 కోట్ల మేర ప్రభుత్వం చెల్లించనుంది. మరికొంత భూమికి
రూ.22 కోట్లు అవసరం. ఫేజ్-1లో మార్చి తొలి వారం నుంచి రోజూ 1.7 ఎంల్‌డీల నీటి సరఫరాకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇప్పటికే ట్రయల్‌రన్ పూర్తి చేసింది. ఫేజ్-2లో 3.3 ఎల్‌ఎండీలు అవసరమని జీఎమ్మార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరాకు ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా పనుల వేగంతో అనుకున్న సమయానికన్నాముందే విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. దీంతో ఉత్తరాంధ్ర గతి మారుతుందని భావిస్తున్నారు.

# ఇప్పటి నుంచి దేవాదాయశాఖకు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం లెక్కలు చెప్పాల్సిందే..!




హైదరాబాద్:పాతబస్తీలోని ఛార్మినార్‌ను ఆనుకుని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం అంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ హిందువుకూ ఓ సెంటిమెంట్. మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటైన ఆలయం కావడం వల్లనో, లేక కోరిన కోర్కెలు తీర్చే మహిమగల దేవతగా పేరొందడం వల్లనో, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం దర్శానికి నిత్యం భక్తులు భారీగా తరలివస్తుంటారు. అంతేకాదు బీజేపీ కేంద్ర పెద్దలు అమిత్ షా, నడ్డా వంటి కీలక నేతలు సైతం హైదరాబాద్ వచ్చారంటే తప్పకుండా ఛార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోకుండా వెళ్లరు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం బీజేపీ నేతలకు ఆనవాయితీగా వస్తోంది. అంతేకాదు ఇటీవల కాలంలో పొలిటికల్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లకు, ప్రమాణాలకు భాగ్యలక్ష్మి ఆలయం వేదికగా మారింది. అంతలా హిందువుల సెంటిమెంట్ ఈ ఆలయంతో పెనవేసుకుని ఉంది. హిందూ, ముస్లింల ఐక్యతతోపాటు, మత విద్వేషాలు చెలరేగకుండా చూడాల్సిన సున్నితమైన ప్రదేశం కూడా ఈ భాగ్యలక్ష్మి ఆలయం. ఇంతలా ప్రధాన్యత ఉన్న భాగ్యలక్ష్మి ఆలయం తాజాగా దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లనుంది. ఇకపై హైదరాబాద్ పాతబస్తీలో చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ నిర్వహణ దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయ శాఖను ట్రైబ్యూనల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. భాగ్యలక్ష్మి ఆలయ చరిత్ర గురించి మాట్లడుకుంటే..1960 సంవత్సరంలో చార్మినార్ వద్దనున్న ఈ అమ్మవారి ఆలయ పరిధిలో బస్సు ప్రమాదం జరగడంతో అమ్మవారి విగ్రహం కూలిపోయింది. స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించారు. అంతకుముందు పోచమ్మ పేరుతో ఉన్న అమ్మవారి పేరును అప్పటి నుంచి భాగ్యలక్ష్మి అమ్మవారిగా మార్చారు. అలా నాటి నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రామ్‌చంద్ర దాసు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్ మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా హెరిడెటరీ ట్రస్టీ ఆర్డర్స్‌తో ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్‌దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. దీనిపై మహంత్ రామ్‌చంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మి ఆలయం అజామాయిషీ చేస్తున్న వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయాల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వహకులు దుర్వినియోగం చేస్తున్నట్టు సాక్షాధారాలను కూడా ట్రబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో భాగ్యలక్ష్మి ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తాజాగా తీర్పు ఇచ్చినట్టు దేవాదాయశాఖ అధికార వర్గాల సమాచారం. ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మి ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రామ్‌చంద్రదాసు నుంచి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోనుంది. 1960 దశకం నుంచి వీరు ఆలయ నిర్వహణ భాధ్యతలు చూస్తున్నారు. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ఆలయానికి తక్షణమే ఈఓను నియమించి ఆలయంలో ఎటువంటి అవకతవకలులేకుండా , అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్ళాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రైబ్యూనల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ అయినట్టు ఆలయ వర్గాలు తెలిపాయి. అంతేకాదు ఇప్పటి వరకూ ఆలయ ఆదాయం, ఖర్చులు ఇతర వివరాలను సేకరించడంతోపాటు భక్తుల విరాళాలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరపడంతోపాటు, ఒకవేళ అవకతవకలు జరిగితే తగిన చర్యలు తీసుకోవాలని ట్రైబ్యూనల్ ఆదేశించినట్లు తెలుస్తోంది.

# బ్యాంక్ రుణాలు చెల్లించనున్న ప్రభుత్వం!

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా లబ్ధిదారుల పేరిట తీసుకున్న బ్యాంకు లోన్లను చెల్లించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయాన్ని టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు. కృష్ణా జిల్లాలోన టిడ్కో ఇళ్లను ఛైర్మన్ అజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే టిడ్కో ఇళ్ల కోసం స్థలాలు ఇచ్చిన రైతులకు కూడా విడతల వారీగా డబ్బులు చెల్లిస్తామని టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు. జూన్ లోగా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. టిడ్కో లబ్ధిదారులకు భారీ ఊరట కలిగించేలా నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు. టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా లబ్ధిదారుల పేరిట వైసీపీ ప్రభుత్వం బ్యాంకుల నుంచి రుణం తీసుకుందని టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రుణాలను ప్రభుత్వమే చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకుండా టిడ్కో లబ్ధిదారుల పేరిట తీసుకున్న 145 కోట్ల రూపాయలను ప్రభుత్వం తరుపున బ్యాంకులకు చెల్లిస్తామని టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు. కృష్ణా జిల్లా జక్కంపూడిలో టిడ్కో ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం టిడ్కో ఛైర్మన్ ఈ విషయాన్ని ప్రకటించారు.

మరోవైపు టిడ్కో ఇళ్ల కోసం స్థలం ఇచ్చిన రైతులకు కూడా వైసీపీ హయాంలో డబ్బులు చెల్లించలేదని టిడ్కో ఛైర్మన్ ఆరోపించారు. వారికి కూడా డబ్బులు చెల్లిస్తామని ప్రకటించారు. అలాగే ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకు చంద్రబాబు నాయుడు అప్పట్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని.. కానీ వైసీపీ హయాంలో వీటి నిర్మాణం ఆగిపోయిందన్నారు. నాలుగున్నర లక్షల మందికి టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఉంటే.. వైసీపీ ప్రభుత్వంలో 2.60 లక్షల మందికే ఇళ్లు కేటాయించారని అజయ్ కుమార్ ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ చర్యల కారణంగా వందల కోట్ల రూపాయలు ప్రజా ధనం వృథా అయ్యిందంటూ టిడ్కో ఛైర్మన్ మండిపడ్డారు. మరోవైపు వచ్చే జూన్‌లోగా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ తెలిపారు. పనులు పూర్తి చేసేందుకు హడ్కో రూ.4,500 కోట్ల రుణం మంజూరు చేసినట్లు వివరించారు. మరోవైపు ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఎం నారా చంద్రబాబు నాయుడు టిడ్కో ఇళ్లపై సమీక్ష నిర్వహించారు. జూన్ 12 నాటికి టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయటంపై అధికారులు ఫోకస్ పెట్టారు. తాజాగా ఇళ్లు ఇవ్వకుండా టిడ్కో లబ్ధిదారుల పేరుతో తీసుకున్న బ్యాంకు రుణాలను ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయాన్నే టిడ్కో ఛైర్మన్ అజయ్ కుమార్ శనివారం వెల్లడించారు.

## ఆస్పత్రిలో బాలుడి మిస్సింగ్..

గురువారం సాయంత్రం విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో ఓ రెండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేశారు. పాపకు పాలు పట్టేందుకు చిన్నారి తల్లి వెళ్లిన సమయంలో.. వెయింటింగ్ హాలులో ఉన్న బాలుడిని ఎత్తుకెళ్లారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నాలుగు గంటల వ్యవధిలో బాలుడిని గుర్తించారు. కిడ్నాపర్ నుంచి స్వాధీనం చేసుకుని తల్లి ఒడికి చేర్చారు.

విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో కిడ్నాప్ కలకలం రేపింది. ఏలూరుకు చెందిన ఫాతిమా అనే మహిళకు ముగ్గురు పిల్లలు. ఒక పాపకు అనారోగ్యంగా ఉండటంతో విజయవాడ పాత ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఫాతిమాతో పాటుగా ఆమె భర్త, రెండేళ్ల కుమారుడు వెయిటింగ్ హాలులో ఉంటూ వస్తున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం ఫాతిమా భర్త ఏలూరు వెళ్లారు. పిల్లాడితో కలిసి ఫాతిమా వెయిటింగ్ హాలులో ఉంటున్నారు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం పాపకు పాలుపట్టేందుకు అని ఫాతిమా లోపలకు వెళ్లారు. పాపకు పాలుపట్టి బయటకు వచ్చి చూసేసరికి వెయిటింగ్ హాలులో ఉండాల్సిన రెండేళ్ల కుమారుడు కనిపించలేదు. దీంతో ఫాతిమా ఆస్పత్రి మొత్తం గాలించారు. ఎక్కడా కుమారుడి జాడ తెలియకపోవటంతో విజయవాడ గవర్నర్ పేట పోలీస్ స్టేషన్‌లో బాబు తప్పిపోయాడంటూ ఫిర్యాదుచేశారు.

తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేసిన గవర్నర్‌పేట పోలీసులు.. బాలుడి ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. సీసీటీవీ కెమెరాల్లో ఓ 15 ఏళ్ల బాలిక.. చిన్నారిని ఎత్తుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆ బాలిక బాలుడిని తీసుకెళ్లి ఆటో ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సీసీటీవీ కెమెరాల్లో రికార్డైంది. ఆటో నంబరు ఆధారంగా ట్రాక్ చేసిన పోలీసులు.. బెంజిసర్కిల్ వద్ద బాలిక, చిన్నారితో కలిసి ఆటో దిగినట్లు గుర్తించారు. అక్కడి నుంచి కోడూరుకు బస్సులో వెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

దీంతో విజయవాడ గవర్నర్‌పేట పోలీసులు.. కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావుకు మిస్సింగ్ కేసు గురించిన సమాచారం ఇచ్చారు. ఎస్పీ ఆదేశంతో అవనిగడ్డ సీఐ నేతృత్వంలో కోడూరు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పోలీసులు బాలిక కోసం గాలించారు. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున బాలుడు, బాలిక కోడూరు ఇండోర్ స్టేడియం సమీపంలో ఉన్నట్లు తెలిసింది. పోలీసులు అక్కడకు చేరుకోగా.. వీరిని చూసిన భయంతో బాలిక బాలుడిని బురదలో పడేసినట్లు సమాచారం. ఆ వెంటనే బాలుడిని రక్షించిన పోలీసులు.. శుభ్రం చేయించి విజయవాడ పోలీసులకు అప్పగించారు. అనంతరం గవర్నర్ పేట పోలీసులు.. బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మొత్తంగా ఫిర్యాదు చేసిన నాలుగు గంటల్లోనే కిడ్నాపైన బాలుడు.. తల్లి ఒడికి చేరాడు.. అయితే బాలుడిని ఎవరికైనా అమ్మేసి డబ్బులు సంపాదిద్దామనే ఆశతోనే 15 ఏళ్ల బాలిక ఈ కిడ్నాప్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కిడ్నాప్ చేసిన బాలికది కృష్ణా జిల్లా కోడూరుగా గుర్తించారు. పిల్లలను కిడ్నాప్ చేయాలనే ఉద్దేశంతోనే కొద్ది రోజుల కిందట విజయవాడ పాత ఆస్పత్రికి వచ్చిందని పోలీసులు వివరించారు. ఆస్పత్రికి వచ్చేవారితో పరిచయం పెంచుకుని.. అదను చూసి పిల్లలను ఎత్తుకెళ్లాలని ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఫాతిమాతోనూ పరిచయం చేసుకుందని.. ఫాతిమా పాపకు పాలు ఇవ్వడానికి లోనికి వెళ్లగానే బాలుడికి చాక్లెట్ చూపించి అక్కడి నుంచి ఎత్తుకెళ్లినట్లు పోలీసులు వివరించారు.

# ఏపీఎస్ఆర్టీసీ శివరాత్రి ఆఫర్.. కుంభమేళా, కాశీ విశ్వేశ్వరుడి దర్శనం



ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ సూపర్ న్యూస్ చెప్పింది. ప్రయాగ్ రాజ్ వెళ్లాలనుకునేవారి కోసం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. అయితే ఇది కేవలం రాజమండ్రి పరిసర వాసులకు మాత్రమే అందుబాటులో ఉంది. మహాకుంభమేళాకు వెళ్లాలనుకునేవారి కోసం రాజమండ్రి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. 11 రోజుల పాటు 13 పుణ్యక్షేత్రాల మీదుగా ఈ ప్యాకేజీ నడుస్తుంది. అలాగే మహాశివరాత్రి రోజున కాశీవిశ్వేశ్వరుడి దర్శనం కూడా చేసుకోవచ్చని ఆర్టీసీ అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనం మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. దేశ విదేశాల నుంచి ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు క్యూ కడుతున్నారు. అందులోనూ ఈ మహాకుంభమేళా 144 ఏళ్ల తరువాత రావటంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. జనవరి 13న మొదలైన ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా.. ఫిబ్రవరి 26తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మహాకుంభమేళాలో పాల్గొని, పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్షలాది మంది భక్తులు రోజూ తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే మహాకుంభమేళాకు వెళ్లేవారికి ఏపీఎస్ఆర్టీసీ సూపర్ న్యూస్ చెప్పింది. కుంభమేళాకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. అయితే ఈ ఆఫర్ రాజమండ్రి ఏపీఎస్ఆర్టీసీ డిపో అధికారులు కల్పిస్తున్నారు. మహాకుంభమేళాలో పాల్గొనాలనుకునే వారి కోసం రాజమండ్రి ఆర్టీసీ అధికారులు.. ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని రాజమండ్రి డిపో అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 18వ తేదీన రాజమండ్రి డిపో నుంచి బయల్దేరనున్న బస్సు.. వివిధ పుణ్యక్షేత్రాల మీదుగా ప్రయాణించి ప్రయాగ్‌రాజ్ చేరుకుంటుంది. ఆ తర్వాత తిరిగి రాజమండ్రికి వస్తుంది. మొత్తం 11 రోజుల పాటు 13 పుణ్యక్షేత్రాల మీదుగా ఈ ఆధ్యాత్మిక యాత్ర జరుగుతుందని రాజమండ్రి డిపో అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 18న రాజమండ్రి నుంచి బయల్దేరనున్న బస్సు.. భువనేశ్వర్‌లోని శ్రీ లింగరాజస్వామి దేవాలయం, పూరీ జగన్నాధస్వామి దేవాలయం, కోణార్క్ సూర్యనారాయణ స్వామి దేవాలయం, జాజ్‌పూర్ గిరిజాదేవి దేవాలయం (శక్తి పీఠం) మీదుగా ప్రయాగ్‌రాజ్ చేరుకుంటుంది. ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో పాల్గొని పుష్కర స్నానాలు ఆచరించిన తర్వాత కళ్యాణిదేవి ఆలయం, త్రివేణి సంగమం దర్శించుకుంటారు. అనంతరం కాశీలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి (జ్యోతిర్లింగం), శ్రీకాశీ అన్నపూర్ణ, విశాలక్షి (శక్తి పీఠం) దర్శించుకుంటారు.

ఆ తర్వాత అయోధ్య చేరుకుని బాలరాముడి దర్శనం చేసుకుంటారు. అక్కడి నుంచి సీతామడి చేరుకుని సీతా సమాహిత్ స్థల్ దర్శించుకుంటారు. అనంతరం నైమిశారణ్యంలో గోమతి నదీ స్నానం, చక్రతీర్థంచ రుద్రావర్తం, లలితాదేవి (ఉప శక్తి పీఠం) దర్శించుకుంటారు. అక్కడి నుంచి గయ చేరుకుని విష్ణు పాద ఆలయం, మంగళ గౌరీ ఆలయం (శక్తి పీఠం) సందర్శిస్తారు. ఆ తర్వాత బుద్ధ గయలోని మహాబోధి ఆలయం సందర్శన ఉంటుంది. అనంతరం అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయం, అన్నవరం సత్యనారాయణ స్వామి దేవాలయం సందర్శన తర్వాత తిరిగి రాజమండ్రికి చేరుకుంటారు.

ఇక ప్యాకేజీలో భాగంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ ప్యాకేజీలో ఒక్కో టికెట్ ధర రూ.12,800 గా నిర్ణయించారు. ప్యాకేజీలో భాగంగా సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణం జరుగుతుంది. మరోవైపు యాత్రలో భాగంగా ఆగినచోట రూమ్స్ తీసుకుంటే, రూమ్స్ చార్జీ అదనమని ఆర్టీసీ అధికారులు తెలిపారు. అలాగే మహాశివరాత్రి పర్వదినం రోజున కాశీ విశ్వేశ్వరుణ్ని దర్శించుకునే అవకాశం ఉంటుందని.. ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని రాజమండ్రి డిపో అధికారులు తెలిపారు.

## 8 ఇండస్ట్రియల్ సిటీలు.! ప్రభుత్వం మాస్టర్ ప్లాన్..

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణకు చర్యలు చేపడుతున్న ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా పోర్టుల వెంబడి పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఈ మేరకు రాష్ట్రంలోని ఆరు పోర్టులకు అనుసంధానిస్తూ 8 చోట్ల పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేసేందుకు ఏపీ మారీటైమ్ బోర్డు ప్రయత్నాలు మొదలెట్టింది. ఈ నగరాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. టెండర్ల ద్వారా కన్సల్టెన్సీలకు మాస్టర్ ప్లాన్ బాధ్యతలు అప్పగిస్తారు. దేశంలోనే అతి పొడవైన తీర ప్రాంతం ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. గతంలో రెండో స్థానంలో ఉన్న ఏపీ.. తాజాగా కేంద్ర జలసంఘం నిర్వహించిన అధ్యయనంలో మూడో స్థానానికి చేరింది. దేశంలోనే అతి పొడవైన తీర ప్రాంతం ఉన్న రాష్ట్రంగా గుజరాత్, రెండో స్థానంలో తమిళనాడు, మూడో ప్లేసులో ఏపీ కొనసాగుతున్నాయి. అయితే ఈ తీరప్రాంతాన్ని అభివృద్ధికి మార్గంగా మార్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే తీరం వెంబడి ఉన్న పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక నగరాలు అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది చోట్ల పోర్టు ఆధారిత పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఓడరేవుల వెంట పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ఏపీ మారిటైం బోర్డు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరు పోర్టుల పరిధిలో 8 పారిశ్రామిక నగరాలు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పోర్టుల వెంబడి పారిశ్రామిక నగరాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు కన్సల్టెన్సీల ఎంపిక కోసం ఏపీ మారిటైమ్ బోర్డు త్వరలోనే టెండర్లు పిలవనుంది. పోర్టులను అనుసంధానిస్తూ ఇండస్ట్రియల్ జోన్లు, నివాస సదుపాయాలు, లాజిస్టిక్ సౌకర్యాలు, గోడౌన్లు అభివృద్ధి చేయడం ద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

మరోవైపు మూలపేట, కృష్ణపట్నం, రామాయపట్నం, కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం పోర్టు పరిధిలో ఈ పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా పోర్టు నుంచి వంద కిలోమీటర్ల పరిధిలో అభివృద్ధి చేయనున్నారు. ప్రధానంగా పోర్టు కేంద్రం నుంచి 25 కిలోమీటర్ల పరిధి వరకూ ఇండస్ట్రియల్ సిటీల అభివృద్ధి జరగనుంది. అలాగే పోర్టు నుంచి వంద కిలోమీటర్ల పరిధిని ప్రాక్సిమల్ ఏరియాగా నిర్ణయించారు. ఈ ఏరియాలో ఎక్కడెక్కడ ఏ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలనే కన్సల్టెన్సీలు సర్వే నిర్వహిస్తాయి. అలాగే భూముల లభ్యత దగ్గర నుంచి మిగతా వివరాలపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తాయి. అనంతరం మాస్టర్ ప్లాన్ ఆధారంగా గోడౌన్లు, ఆఫీస్ స్పేస్‌లు, రెసిడెన్షియల్ ఏరియాలు, లాజిస్టిక్ సౌకర్యాలు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## విజయసాయిరెడ్డి రాజీనామా



వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామాపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. విజయసాయిరెడ్డి శనివారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయమై సీఎం చంద్రబాబును విలేకర్లు ప్రశ్నించగా.. విజయసాయిరెడ్డి రాజీనామా వైసీపీ అంతర్గత వ్యవహారమన్నారు. అయితే విజయసాయిరెడ్డి రాజీనామా ఆ పార్టీ స్థితికి అద్దం పడుతోందంటూ చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఎంపీ పదవికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి.. తాను ఏ పార్టీలో చేరడం లేదని.. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజీనామా వ్యవహారం ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో హాట్ టాపిక్‌గా ఉన్న సంగతి తెలిసిందే. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని శుక్రవారం ఎక్స్ వేదికగా విజయసాయిరెడ్డి ప్రకటించారు. శనివారం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసిన విజయసాయిరెడ్డి రాజీనామా పత్రం సమర్పించారు. తాను ఏ రాజకీయ పార్టీలో చేరడం లేదన్న విజయసాయిరెడ్డి.. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా నిర్ణయం పూర్తిగా తన వ్యక్తిగతమని.. ఎలాంటి ఒత్తిడి లేదని చెప్తున్నారు. వేరే పదవులు, ప్రయోజనాలు కూడా ఆశించడం లేదని విజయసాయిరెడ్డి తెలిపారు. అయితే వైసీపీలో అత్యంత కీలక స్థానంలో ఉన్న విజయసాయిరెడ్డి ఒక్కసారిగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం, రాజీనామా చేయడం రాజకీయ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది

ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి రాజీనామా వ్యవహారంపై ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. దావోస్ పర్యటన విశేషాల గురించి చంద్రబాబు నాయుడు.. శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి రాజీనామా అంశంపై చంద్రబాబును విలేకర్లు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి రాజీనామా వైసీపీ అంతర్గత వ్యవహారమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. నమ్మకం ఉంటే ఉంటారు, లేకపోతే వెళ్లిపోతారని.. రాజకీయాల్లో ఇలాంటి పరిణామాలు జరుగుతూ ఉంటాయని చంద్రబాబు అన్నారు. విజయసాయిరెడ్డి రాజీనామా ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని, తాను కామెంట్ చేయనని చంద్రబాబు అన్నారు. అయితే విజయసాయిరెడ్డి రాజీనామా వైసీపీ పరిస్థితికి అద్దం పడుతోందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. మరోవైపు కూటమి నేతలు కూడా విజయసాయిరెడ్డి రాజీనామాపై స్పందిస్తున్నారు. విజయసాయిరెడ్డి ఎంపీ పదవికి రాజీనామా చేసినంత మాత్రాన చట్టం నుంచి తప్పించుకోలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విశాఖపట్నంలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిన గంటా శ్రీనివాసరావు.. విజయసాయిరెడ్డితో విశాఖవాసులు పడిన ఇబ్బందులు మరిచిపోలేదని అన్నారు. వైసీపీని మునిగిపోయే నావగా అభివర్ణించిన గంటా శ్రీనివాసరావు.. వైఎస్ జగన్ కారణంగా మరికొంతమంది ఆ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇక విజయసాయి రెడ్డి బాటలోనే మరికొంతమంది నేతలు వైసీపీని వీడతారని బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమని భానుప్రకాష్ రెడ్డి జోస్యం చెప్పారు.

## గొడ్డలి కలలోకి వచ్చిందేమో..



విజయసాయిరెడ్డి రాజీనామాపై ఏపీ హెూంమంత్రి అనిత సెటైర్లు వేశారు. విజయసాయి రెడ్డికి గొడ్డలి కలలోకి వచ్చిందేమో.. అందుకే భయపడి రాజీనామా చేసి ఉండొచ్చని విమర్శించారు. రాజకీయాల్లో ఉన్నా లేకపోయినా చేసిన తప్పునకు శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. విజయసాయిరెడ్డి రాజీనామాపై ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత సెటైర్లు వేశారు. విజయసాయి రెడ్డికి గొడ్డలి కలలోకి వచ్చిందేమో.. అందుకే భయపడి రాజీనామా చేసి ఉండొచ్చని విమర్శించారు. రాజకీయాల్లో ఉన్నా లేకపోయినా చేసిన తప్పునకు శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు.

విశాఖ జువైనల్ హెూమ్‌ను శనివారం నాడు వంగలపూడి అనిత పరిశీలించారు. పిల్లలను రక్షించే బాధ్యత ప్రభుత్వానిదేనని.. దీన్ని ఎవరో గుర్తుచేయాల్సిన అవసరం లేదని అన్నారు. వైసీపీ ట్విట్టర్ (ఎక్స్)లో చేసిన పోస్టుల్లో 80 శాతం అవాస్తవాలే అని పేర్కొన్నారు. గత ఐదేళ్లు అబద్ధాలతో గడిపేశారని.. ఇప్పుడు కూడా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని.. తప్పు చేసిన వాళ్లకు కచ్చితంగా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ దావోస్ పర్యటనకు వెళ్లి.. రాష్ట్రానికి ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేదని వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలపైనా వంగలపూడి అనిత స్పందించారు. గత ఐదేళ్లలో దావోస్‌లో నాలుగుసార్లు సమ్మిట్ జరిగితే ఒక్కసారి మాత్రమే వెళ్లొచ్చారని జగన్‌ను విమర్శించారు. తిరునాళ్లలో తప్పిపోయిన పిల్లాడిలా బిత్తర చూపులు చూస్తూ.. ఇట్స్ లెంగ్త్ క్వశ్చన్ అని అన్నారని చెప్పారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుంది కాబట్టే.. పెట్టుబడులు రావడం లేదని మాజీ మంత్రి రోజా చేసిన విమర్శలపైనా ఆమె స్పందించారు. రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తే.. వైసీపీ వాళ్లు ఈ 7 నెలల్లో రోడ్ల మీదకు వచ్చే పరిస్థితి ఉండేది కాదని అన్నారు.

## మిగతా విషయాలు కూడా బయటపెట్టండి..

వైసీపీ సీనియర్ నాయకుడు విజయసాయి రెడ్డి రాజీనామాపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. విజయసాయి రెడ్డి రాజీనామా చిన్న విషయం కాదని ఆమె అన్నారు. తనను కాపాడుకోవడం కోసమే ఆయన్ను జగన్ బీజేపీలోకి పంపిస్తున్నారని ఆరోపించారు.
వైసీపీ సీనియర్ నాయకుడు విజయసాయి రెడ్డి రాజీనామాపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. విజయసాయి రెడ్డి రాజీనామా చిన్న విషయం కాదని ఆమె అన్నారు. తనను కాపాడుకోవడం కోసమే ఆయన్ను జగన్ బీజేపీలోకి పంపిస్తున్నారని ఆరోపించారు.
విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌కు విజయసాయి రెడ్డి అత్యంత సన్నిహితుడు అని తెలిపారు. జగన్ ఏ పని ఆదేశిస్తే ఆ పనిచేయడం, ఎవరిని తిట్టమంటే వాళ్లను తిట్టడమే ఆయన పని అని అన్నారు. రాజకీయంగానే కాదు.. వ్యక్తిగతంగా కూడా తన బిడ్డల విషయంలో అబద్ధాలు చెప్పిన వ్యక్తి విజయసాయి రెడ్డి అని పేర్కొన్నారు. ఇలాంటి జగన్ సన్నిహితుడు రాజీనామా చేశారంటే అతి చిన్న విషయం కాదని అన్నారు. దీనిపై వైసీపీ, వైఎస్ అభిమానులు ఆలోచన చేయాలని సూచించారు.
విజయసాయిరెడ్డిని జగన్ ఎందుకు వదిలేశారని షర్మిల ప్రశ్నించారు. జగన్ రెడ్డి సన్నిహితులు ఒక్కొక్కరుగా ఎందుకు బయటకు వెళ్తున్నారని అడిగారు. ప్రాణం పెట్టిన వాళ్లు ఎందుకు జగన్‌ను వీడుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. నాయకుడిగా జగన్ విశ్వసనీయతను కోల్పోయారని ఆరోపించారు. నాయకుడిగా ప్రజలను, నమ్ముకున్న వాళ్లను జగన్ మోసం చేశారని, తనకు ఉన్న వాళ్లను కాపాడుకోలేకపోతున్నారని అన్నారు.

## దేశంలోనే అత్యంత ఖరీదైన ఆయిల్ రిఫైనరీ

ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే అతి పెద్ద ఆయిల్ రిఫైనరీ రాబోతోంది. సుమారు రూ.95 వేల కోట్ల వ్యయంతో దేశంలోనే అత్యంత ఖరీదైన రిఫైనరీని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బీపీసీఎల్ డైరెక్టర్ (ఫైనాన్స్) వెస్టా రామకృష్ణ గుప్తా ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌కు సంబంధించిన పలు కీలక అంశాలను వెల్లడించారు. ఈ రిఫైనరీకి సుమారు రూ.95 వేల కోట్ల వ్యయం అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా తొమ్మిది మిలియన్ టన్నుల సామర్థ్యం గల ఆయిల్ రిఫైనరీ కం పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌లో బీపీసీఎల్ ఏర్పాటు చేయబోయే ఆయిల్, పెట్రో కెమికల్ రిఫైనరీ దేశంలోనే అత్యంత ఖరీదైన ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని గుప్తా వివరించారు. బీపీసీఎల్ 2014లో దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ తొలిసారి బాధ్యతలు చేపట్టినప్పుడు రిఫైనరీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ రిఫైనరీని రూ.3లక్షల కోట్ల అంచనా వ్యయంతో మహారాష్ట్రలోని రత్నగిరిలో 60 మిలియన్ టన్నుల మెగా ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని భావించామన్నారు. అయితే భూ సేకరణలో సమస్యలతో ఆ ప్రాజెక్టుకు అడుగులు ముందుకుపడలేదన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో బీపీసీఎల్ ఏర్పాటు చేయబోతున్న ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కోసం భూసేకరణ, డీపీఆర్, ఫీడ్ బ్యాక్ స్టడీ కోసం ప్రీ ప్రాజెక్టు ప్రొగ్రామ్స్‌కు రూ.6,100 కోట్లు ఖర్చు చేయబోతున్నారని.. ఈ మేరకు ఆమోదం కూడా లభించిందన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం మూలధన రాయితీలు కూడా అందిస్తుందన్నారు.

ఈ ప్రాజెక్ట్ డీపీఆర్, ఫీడ్‌బ్యాక్ స్టడీకి సంబంధించి రిపోర్ట్ 6 నుంచి 8 నెలల్లో వస్తుందన్నారు. పూర్తిస్థాయిలో రిపోర్టులు వస్తే జాయింట్ వెంచర్ ప్రాజెక్ట్‌కు పూర్తి ఖర్చు ఎంత అవుతుందో ఓ అంచనాకు రావొచ్చన్నారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం ఎంత వ్యయం అవుతుందనే అంచనాకు వచ్చిన తర్వాత 48 నెలల్లో ప్రాజెక్టు పూర్తవుతుందని చెప్పారు గుప్తా. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర తీర ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నామని.. ఈ మేరకు ప్రాజెక్టుకు అవసరమైన భూముల్ని కూడా గుర్తించినట్లు తెలిపారు. మొత్తం 6వేల ఎకరాల భూమి అవసరమని.. భూసేకరణకు సంబంధించిన పనుల్ని మొదలుపెట్టాల్సి ఉందన్నారు. బీపీసీఎల్ ప్రాజెక్ట్ 2040 వరకు భారతదేశ ఇంధన డిమాండ్‌ను తీర్చడానికి సరిపోతుందన్నారు. దేశంలో ముంబై, మధ్యప్రదేశ్, కొచ్చిలో రిఫైనరీలను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయబోయేది నాలుగో రిఫైనరీ అన్నారు. బీపీసీఎల్ రిఫైనరీని ముందు మచిలీపట్నంలో ఏర్పాటు చేయాలని భావించారు.. కానీ ఆ తర్వాత నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

ఉత్తేజిత దినపత్రిక

# కుమారధార తీర్థ ముక్కోటిపై అదనపు ఈవో సమీక్ష


**తిరుమల,ఉత్తేజిత ప్రతినిధి, ఫిబ్రవరి 27**



మార్చి 14వ తేదిన తిరుమలలో జరగనున్న కుమారధార తీర్థ ముక్కోటి పై టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి గురువారం తిరుమలలోని అన్నమయ్య భవన్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమారధార తీర్థ ముక్కోటికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 14వ తేది ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే భక్తులను కుమారధార తీర్థానికి అనుమతిస్తామన్నారు. అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లలు, వృద్ధుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అటవీ మార్గంలో ఈ తీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమతించమని తెలిపారు. పాపవినాశనం నుండి కుమారధార తీర్థం వరకు అక్కడక్కడ భద్రతా సిబ్బందిని వుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్గమధ్యంలో తాగునీటిని అందుబాటులో ఉంచాలని, అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో పాపవినాశనం డ్యామ్ వద్ద ఉదయం 6 గంటల నుండి భక్తులకు పొంగళి, ఉప్మా, సాంబారన్నం, పెరుగన్నం, పాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన షెడ్లు, మార్గమధ్యలో నిచ్చెనలు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భక్తులకు అందుబాటులో ఉండేందుకు వీలుగా అంబులెన్స్‌లు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందితోపాటు అవసరమైన మందులను అందుబా టులో ఉంచుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు శ్రీ లోకనాథం, శ్రీ రాజేంద్ర, ట్రాన్స్ పోర్ట్ జీఎం శ్రీ శేషారెడ్డి, వీజీవోలు శ్రీ రామ్ కుమార్, శ్రీ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమలలో వేసవి ఏర్పాట్లపై అదనపు ఈవో సమీక్ష

**తిరుమల, ఉత్తేజిత ఫిబ్రవరి, 27.**



తిరుమల శ్రీవారి దర్శనార్థం వేసవిలో విచ్చేసే లక్షలాదిమంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో గురువారం వేసవి సెలవుల యాత్రికుల రద్దీకి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ మొదటి ఘాట్ రోడ్డులోని అక్కగార్ల గుడి, శ్రీవారి సేవా సదన్, తిరుమలలో భక్తుల రద్ధీ అధికంగా ఉండే ప్రాంతాల్లో చలువ పెయింట్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవిలో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. యాత్రికుల అవసరాలను తీర్చడానికి తగినంత లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచాలని ఆలయ అధికారులకు సూచించారు. యాత్రికుల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను తగినంత నిల్వ ఉంచాలని వైద్య అధికారులను ఆదేశించారు. రాబోవు వేసవిలో తిరుమలలోని అన్ని ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు శ్రీ లోకనాథం, శ్రీ రాజేంద్ర, శ్రీ భాస్కర్, ట్రాన్స్ పోర్ట్ జీఎం శ్రీ శేషారెడ్డి, వీజీవోలు శ్రీ రామ్ కుమార్, శ్రీ సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మార్చి 1న చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా గౌ. ముఖ్యమంత్రి రేణిగుంట విమానాశ్రయం రానున్న నేపథ్యంలో ఎఎస్ఎల్ లో భాగంగా ముందస్తు భద్రత ఏర్పాట్లపై సమీక్షించిన తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్





**తిరుపతి ,ఉత్తేజిత ప్రతినిధి,ఫిబ్రవరి27 :**

గౌ. ఆం.ప్ర రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు మార్చి 1వ తేదీన చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయం రానున్నారని, సీఎం గారి పర్యటనలో చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వరాదని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ అధికారులను ఆదేశించారు.గురువారం ఉదయం %ూూూ% లో ( ముందస్తు భద్రత లైజన్ ) భాగంగా రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సిఎం పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఈ నెల మార్చి 1న ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి చిత్తూరు జిల్లాలో గంగాధర నెల్లూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనటానికి హెలికాప్టర్ లో బయల్దేరి వెళ్లనున్నారనీ, తిరిగి మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ వారు స్పెషలిస్ట్ డాక్టర్లు ఏర్పాటు, సేఫ్ రూమ్ ఏర్పాటు అమర ఆసుపత్రి, నారాయణాద్రి ఆస్పత్రి, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, ఫైర్ సేఫ్టీ తదితరాల ఏర్పాటు పై విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మన్నే, ఏఎస్పీ లు శ్రీనివాస రావు, ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి, డిఎంహెచ్ఓ బాలాజీ నాయక్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఎయిర్పోర్ట్ అధికారులు, పాల్గొన్నారు.

# వాణిజ్య పంటలకు మార్కెట్ కల్పించలేని పాలకులు !

రకరకాల వాగ్దానాలు..రకరకాల పథకాలు...రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరలు..ఇలాంటి ప్రకటనలతో ప్రభుత్వాలు ప్రకటనలు గుప్పించి అధికారంలోకి వస్తున్నా..అన్నదాతల విషయంలో ఏ ప్రభుత్వం కూడా ముందుచూపుతో వ్యవహరించడం లేదు. దీనికంతటికి ఈ దేశంలో సమగ్ర వ్యవసాయ విధానం లేదు. ఏ పంటలు పండించాలి..ఏ పంటలు ఎగుమతి చేయాలన్న దానిపై పాలకులకు అవగాహన లేకుండా పోతోంది. రైతుల నుంచి సమాచారం వచ్చినా పట్టించుకోవడం లేదు. ప్రధానంగా మనదేశంలో వరి,గోధుమ, జొన్నలు లాంటి తృణధాన్యాలతో పాటు, వాణిజ్య పంటలకు కూడా అవకాశం ఉంది. మన నేతలు అన్ని పంటలకు అనువుగా ఉన్నాయి. ప్రధానంగా వాణిజ్య పంటలను విపరీతంగా పండించే ఛాన్స్ ఉంది. మిర్చి, పసుపు, పత్తి, అల్లం వెల్లుల్లి లాంటి పంటలను కూడా ఎగుమతులు చేసేలా పండించుకునే వీలుంది. రైతులు చెమటోడ్చి ఈ పంటలను ఏటా పండిస్తూనే ఉన్నారు. అయినా పంటల దిగుబడి రాగానే మద్దతు ధరల పేచీ..ఎగుమతుల విధానంలో పేచీ...ఇలా సవాలక్ష కొర్రీలతోరైతులను ఆగం చేస్తున్నారు. ఇంతెందుకు ఇటీవల ఎపిలో మిర్చి పండించిన రైతులకు ప్రభుత్వాలు చుక్కలు చూపుతున్నాయి. తెలంగాణలో మిర్చితో పాటు పత్తి, పసుపు పంటలకు సకాలంలో గిట్టుబాట ధరలు రావడం లేదు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి కబుర్లు చెబుతున్న సిఎం చంద్రబాబు నాయుడు మిర్చి సేకరణ విషయంలో పూర్తిగా విఫలం అయ్యారు. తెలంగాణలోనూ అదే పరిస్థితి. పండించిన పంటలను కొనుగోలు చేసి, పేదలకు తక్కువ ధరలకు అమ్మడం కూడా ఓ రకంగా ఆదుకోవడమే అవుతుంది. ఎగుమతులను పెంచుకోవడం ద్వారా రైతులకు అండగా నిలవవచ్చు. కానీ అలా జరగడం లేదు. రూపాయికే కిలో బియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఈ దండగమారి పథకాన్ని ఎత్తేయడం లేదు. ఉపాధిహామీతో పనికిరాని పనులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఉచిత పథకాలతో కూలీలు కూడా దొరకడం లేదని సుప్రీం జడ్జి వ్యాఖ్యానించినా మొద్దు నిద్ర వీడడం లేదు. తమ భద్రతకు వేలకోట్లు ఖర్చు చేస్తున్న నాయకులు రైతుల కోసం మాత్రం బిచ్చం వేసినట్లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా ఎపిలో మిర్చి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్నారు. తెలంగాణలో కూడా ఇప్పుడు మిర్చి బాగా పండింది. నిజానికి వ్యవసాయాధారిత పరిశ్రమలను పెట్టి పంటలను కొనుగోలు చేసి, మిర్చి పౌడర్‌ను తక్కువ ధరలకు ప్రజలకు అందించవచ్చు. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. మార్కెట్లో డబ్బు చెలామణి అవుతుంది. ప్రభుత్వం, ప్రైవేట్ రంగంలో ప్రోత్సాహకాలతో పంటలను అమ్మించే ప్రయత్నం చేయవచ్చు. దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచితే విదేశీ మారకం పెరగగలదు. కానీ అలా చేయడం లేదు. ఎపిలో పీకల్లోతు కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను బేషరతుగా ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టడం, రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూడడం కూడా తప్పే. ఇలాంటి సందర్భంలో ఎలా ఆదుకోవాలన్న ఆలోచన లేకుండాపోతోంది. లక్షల రూపాయలు పెట్టుబడి పెడితేగాని మిర్చి సాగు సాధ్యం కాదు. నారు నాటినప్పటి నుండి పంట చేతికివచ్చేంతవరకు మిర్చి రైతుది దినదిన గండం బతుకే! చీడ, పీడలు, తెగుళ్ల బెడద ప్రతిరోజూ వెంటాడుతున్నది. వీటన్నింటిని అధిగమించి యార్డు దాకా తెచ్చిన సరుకుకు నామమాత్రపు ధర కూడా పలకకపోతే సాగు చేసిన రైతు పరిస్థితి ఏమిటన్న ఆలోచన చేసేదెవరు. ఆదుకోవాలని కోరితే పండిన పంటలో పావు వంతే కొంటామనడం ఏ విధమైన ఊరడంపో అర్థం కాదు. మిగిలిన పంటను ఎవరికి అమ్ముకోవాలన్నది వారే చెబితే బాగుండేది. గత ఏడాది గరిష్టంగా క్వింటాకు 28 వేల రూపాయలు ధర పలికితే, ఇప్పుడు కేవలం 11,781 రూపాయల రేటు ఎలా నిర్ణయించారు. దీనికి ప్రాతిపదిక ఏమిటన్నద ఇపాలకులు వివరించాలి. అది కూడా నెలరోజుల వరకే కొంటామని చెప్పడం మరీ దారుణం. ఈ తరహా విధానాలు మిర్చి రైతాంగానికి పెనుశాపంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం మద్దతుగా ప్రకటించిన 11,781 రూపాయలను ప్రామాణికంగా తీసుకుని గత ఏడాది ధరలతో పోలిస్తే ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు లెక్కలు వేసి చెబుతున్నారు. ఇంత ఘోరంగా పరిస్థితులు ఉంటే, రాష్ట్రంలో ఏ రైతు కూడా కష్టాల్లో లేరని ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం మరీ దారుణం! ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలి. తక్షణం నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించి రైతాంగం కోరుతున్నట్లు క్వింటాకు కనీసం 20 వేల రూపాయల చొప్పున చెల్లించి, మొత్తం పంటను కొనుగోలు చేయాలి. అన్ని రకాల షరతులను ఎత్తివేయాలి. దీనికోసం అవసరమైతే కలిసివచ్చే శక్తులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పాలక కూటమికి రాజకీయంగా ఇబ్బంది అనుకుంటే రైతులను, అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి కేంద్రం వద్దకు వెళ్లాలి. ఢిల్లీ పాలకుల మెడలు వంచి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి. ఒకసారి రైతు ఈ ధరకు పావు వంతు సరుకును అమ్మిన తరువాత మిగిలిన సరుకుకు ఎంత ధర పలుకుతుందో తెలియంది కాదు. ట్రేడర్లు అంతకన్నా తక్కువకే కొంటారు తప్ప ధరలు పెంచరు. నెలరోజుల గడువు ముగిసిన తరువాత మార్కెట్‌కు వచ్చే సరుకు పరిస్థితి ఏమిటన్న ఆలోచన కూడా చేయరంటే...వీరికి పంటలపై ఎలాంటి అవగాహన ఉందో తెలుసుకోవచ్చు. ఉదయం లేచింది మొదలు మార్కెట్ ఎకానమి సూత్రాలను వల్లించే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు మార్కెట్ ఒడిదుడుకులు, పంటల గురించి అవగాహన లేదనుకోవాలి. లాభాల పంటను, రైతులకు నష్టాల మంటను మిగల్చడం కాక మరోటి కాదు. ఆర్థికంగా రాష్ట్రం అనేక కష్టాలు ఎదుర్కొంటుంటే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటు చేసుకోవాలనడం, ఖర్చులో సగభాగాన్ని రాష్ట్రమే భరించాలని కేంద్రం షరతులు పెట్టడం మరింత దుర్మార్గం. ఇంత నిర్దయగా కేంద్రం వ్యవహరించినా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడానికి సైతం సిద్ధపడకపోవడం బాధాకరం! తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ తీరు, రైతులను ఆదుకనేలా లేదు. సొంతంగా పంటల కొనుగోలు విధానాలు అవలంబించాలి. గుంటూరు మిర్చి యార్డు నుండి చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థారులాండ్‌లకు మిర్చి ఎగుమతులు అత్యధికంగా జరుగుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుండి 1.79 లక్షల టన్నుల మిర్చిని చైనా దిగుమతి చేసుకుంది. వీటి విలువ 4,123 కోట్ల రూపాయలు! అయితే, అమెరికాతో అంటకాగే విధానాల్లో భాగంగా చైనాతో పాటు పలు ఇతర దేశాలకు చేసే ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టింది. ఫలితంగా ఎగుమతుల మార్కెట్ భారీ స్థాయిలో క్షీణించి, నిల్వలు పేరుకుపోయాయి. రైతాంగం ఆందోళన నేపథ్యంలో చైనాతో ఆర్డర్లను పునరుద్ధరించడానికి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ప్రయత్నించినప్పటికీ కేంద్రం నుండి సానుకూల స్పందన రాలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. సమగ్ర పంటల విధానం అవలంబించాలి. ఎగుమతులు దిగుమతులపై సమీక్షించాలి. అప్పుడే వ్యవసాయరంగం పురోగమించగలదు.

# బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం : ఏవో షేక్షావలి

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఫిబ్రవరి 27:**



నందికొట్కూరు మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి వైవి మురళీకృష్ణ సార్ మరియు జడ్పీఎన్ఎఫ్ నరేంద్ర సార్, నందికొట్కూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సి విజయ శేఖర్ సార్ మరియు నందికొట్కూరు వ్యవసాయ అధికారి పీ. షేక్ షా వలి , వ్యవసాయ విస్తరణాధికారులు రైతు సేవా కేంద్రం యొక్క సిబ్బంది రైతులు జెడ్పిఎన్ఎస్ సిబ్బంది పాల్గొనడం జరిగినది. ఇందులో ఎంపీఎస్ అప్ , ప్లాంట్స్ అప్ గురించి రైతులకు వివరించడం జరిగినది., ఏపీ ఎఫ్ ఆర్ రైతుల విశిష్ట సంఖ్య కొరకు రిజిస్ట్రేషన్స్ గురించి చెప్పడం జరిగినది మరియు పంటలపై వచ్చే చీడ పీడల గురించి చర్చించడం జరిగినది మరియు పంట మార్పిడి చేయాలని సూచించడం జరిగినది వేసవి దిక్కులు చేసుకుని మరియు రక్షక పంటలు , జిగురు అట్టలు, లింగాకర్షణ బుట్టలు, ఎర్ర పంటలు పంటలు,పచ్చిరొడ్డ ఎరువులను వేసుకోవాలని సూచించడం జరిగినది, జడ్పీ అనే ఎఫ్ జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు అవగాహన తెలిపి చేసి చూపించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ సిబ్బంది గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ పోలీసులు నవోదయ 2.0 నాటు సారా

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్ ఫిబ్రవరి 27:**





డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ కర్నూల్ పి శ్రీదేవి మరియు నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ఎస్ రవికుమార్ ఆదేశాల మేరకు నందికొట్కూరు పట్టణంలోని సమగ్ర శిశు అభివృద్ధి కార్యాలయం నందు నవోదయం 2.%ూ% నాటు సారా నిర్మూలన గురించి అవగాహన సదస్సు ను ఏర్పాటు చేయడమైనది ఈ సదస్సు నందు ఎస్సై ఎస్ఎండి జఫరుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాటు సారా నిర్మూలన గురించి గొప్ప కార్యక్రమమును చేపట్టినది అందులో భాగంగా మన నందికొట్కూరు మండలం మరియు పట్టణం లో నాటు సారాయి రహిత మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సమగ్ర శిశు అభివృద్ధి సేవ పదాధికారిణి ఎస్ కోటేశ్వరి మాట్లాడుతూ సారా వల్ల బ్రతుకుల్లో పాడై పోతాయి అని సారాయికి దూరంగా ఉండాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు సమగ్ర శిశు అభివృద్ధి సేవ పదాధికారిని మంగవల్లి, సూపర్వైజర్లు వరలక్ష్మి,జి వెంకటేశ్వరి, రమణమ్మ ప్రసంగించినారు మరియు మండలంలోని మొత్తం గ్రామాల అంగన్వాడి కార్యకర్తలు

ఈ కార్యక్రమంలో పాలుపంచుకు న్నారు. అదేవిధంగా నవోదయం కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ జఫరుల్లా హెడ్ కానిస్టేబుల్ కుమారి, పద్మనాభం, కే శ్వేతా రాణి పాల్గొన్నారు.

# రేపటి నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

**బేతంచెర్ల : ఉత్తేజిత ప్రతినిధి**



మార్చి ఒకటవ తేదీ నుంచి జరగబోయే ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలకు ఏపీ మోడల్ స్కూల్ ,గోరుమానుకొండ జూనియర్ కాలేజ్ నందు సెంటర్ కలిగి పరీక్ష రాయబోయే విద్యార్థులను ఉద్దేశించి పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ టి.మరియ దాస్ , డిపార్టుమెంటల్ ఆఫీసర్ రాజా దిలీప్ కుమార్ లు పరీక్ష నియమాలను తెలిపారు.ఉదయం 8:30 నిమిషాల లోపల పరీక్షా కేంద్రానికి చేరుకోవలెనని,ప్రతిరోజు ఉదయం 9:00 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది.9:00 గంటల తర్వాత ఒక్కనిమిషం అలస్యమయినా అనుమతించరు.కాబట్టి దూరప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రానికి చేరుకునే విద్యార్థులు మీ మీ వాహన సౌకర్యాల ద్వారా గానీ,ఆర్టీసీ బస్సు ద్వారా గానీ సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని,బేతంచెర్ల,కర్నూలు రహదారి నిర్మాణంలోఉండడం వలన విద్యార్థులకు ఆలస్యం అయ్యే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ విషయాన్ని గమనించి,త్వరగా పరీక్ష కేంద్రానికి చేరుకునే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ఈ పరీక్ష ఏర్పాట్లను మండల విద్యాధికారి జి.సోమ శేఖర్,అధికారులకు సూచనలు,సలహాలు చేశారు.

# నేడు అసెంబ్లీ ముందుకు ఎపి బడ్జెట్

## తొలిసారి బడ్జెట్ ప్రవేశ పెడుతున్న కేశవ్

## సూపర్ సిక్స్ పథకాలపై సర్వత్రా ఆసక్తి

అమరావతి: ఏపీ బ్జడెట్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. 28న శుక్రవారం ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నారు. ఇప్పటికే వివిధ శాఖలతో ఆయన సమీక్షించారు. తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ బడ్జెట్‌కు ముఖ్య లక్ష్యం రాష్ట్ర వృద్ధి రేటు 15 శాతం సాధించడం, 2.4 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడమే. ఇందుకోసం మూలధన వ్యయాన్ని పెంచుతూ, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇకపోతే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. అలాగే హామీలను అమలు చేస్తామని సిఎం చంద్రబాబు కూడా ప్రకటించారు. పట్టణ పునరుద్ధరణ ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, పరిశ్రమల వృద్ధి, పునరుత్పత్తి శక్తి రంగాల్లో పెట్టుబడులు బ్జడెట్‌లో ముఖ్య ప్రాధాన్యత పొందనున్నాయి. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ హబ్‌ల అభివృద్ధి, తయారీ పరిశ్రమల వృద్ధి తదితర రంగాల్లో ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ పథకాలతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, ఆరోగ్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పాఠశాలల మౌలిక సదుపాయాల మెరుగుదల, ఉచిత ఆరోగ్య సంరక్షణ పథకాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల బలోపేతం అన్నవి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. తమ పథకాల అమలుకు తగినంత నిధులు కేటాయించడమే కాకుండా, వాటి ఆర్థిక ప్రభావాన్ని సమీక్షించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల అమలుకు పెద్దపీట వేస్తోంది. సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0, సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ కీలకమైనవి. వీటిలో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరికొన్నింటిని త్వరలోనే అమలు చేస్తామని ప్రకటించారు. ఈ హామీల అమలుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఆర్థిక లోటు ఉన్నా, సంక్షేమ పథకాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు ప్రభుత్వం మూడేళ్లలో రూ.60,000 కోట్ల వ్యయంతో అమరావతిని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వరల్డ్ బ్యాంక్, ఆసియా డెవలప్మెంట్ బ్యాంక్ వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రూ.30,000 కోట్ల పైగా రుణాలకు హామీ తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సందర్భంగా దీనిపై మరింత స్పష్టత ఇవ్వనుంది. ఆర్థిక శాఖకు 28 శాఖల బడ్జెట్ సమీక్షలు పూర్తి కావడంతో, మంత్రులంతా తమ శాఖలకు అధిక నిధులు కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ మంత్రిత్వ శాఖ మాత్రమే రూ.37,000 కోట్లు కోరగా, ప్రభుత్వం రూ.27,000 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే ఈ పూర్తి స్థాయి బ్జడెట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని స్థిరపరిచేలా, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమల పెట్టుబడులకు సమతుల్యత కల్పించేలా ఉండబోతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

ఉత్తేజిత దినపత్రిక



# ఏకంగా 174 శాతం ప్రీమియంతో ఎంట్రీ!



స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారు ముఖ్యంగా ఐపీఓల కోసం ఎదురుచూస్తుంటారు. ఇవి లిస్టింగ్‌తోనే బంపర్ రిటర్న్స్ ఇస్తుంటాయి. గతేడాది ఆఖర్లో స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లిన నేపథ్యంలో.. పలు ఐపీఓలు ఇన్వెస్టర్లకు మంచి లాభాలు అందించాయని చెప్పొచ్చు. ఇప్పుడు చాలా రోజుల తర్వాత ఒక ఐపీఓ భారీ లాభాలు నమోదు చేసింది. లిస్టింగ్‌తోనే 174 శాతం ప్రీమియం నమోదు చేసి.. మళ్లీ అప్పర్ సర్క్యూట్ కొట్టింది.

మీరు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారా? మరి సరైన స్టాక్స్ ఎంచుకుంటున్నారా? ఇంకా ఆర్థిక నిపుణుల సలహా కూడా తీసుకోవాలి. మార్కెట్లను జాగ్రత్తగా గమనిస్తూ ఒక పద్ధతిలో పెట్టుబడులు పెడుతుండాలి. ఇలా దీర్ఘకాలంలో చాలా స్టాక్స్ మంచి రిటర్న్స్ అందిస్తుంటాయి. ఇంకా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. వీటిల్లో చాలా వరకు మంచి ప్రీమియంతో స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అవుతుంటాయి. స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి. 100 శాతం నుంచి 250 శాతం వరకు తొలిరోజే పెరగడం విశేషం.

ఇప్పుడు ఇదే బాటలో చాలా రోజులకు మరో ఐపీఓ అదిరిపోయే రిటర్న్స్ లిస్టింగ్‌లోనే నమోదు చేసింది. ఇష్యూ ధర రూ. 106 కాగా.. ఏకంగా 173.58 శాతం ప్రీమియంతో రూ. 290 వద్ద లిస్టయింది. ఇదే టీఏసీ ఇన్ఫోసెక్ స్టాక్. అక్కడితో ఆగలేదు తర్వాత మరో 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో చివరకు 187 శాతం లాభంతో రూ. 304.50 వద్ద స్థిరపడింది. దిగ్గజ పెట్టుబడిదారుడైన విజయ్ ఖేడియా ఇన్వెస్ట్ చేసిన ఈ ఐపీఓ మార్చి 27 (బుధవారం) సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. ఏప్రిల్ 2న (మంగళవారం) ముగిసింది. ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది. సబ్‌స్క్రిప్షన్ చివరి రోజున ఏకంగా 422.03 రెట్ల స్పందన లభించింది. ఇక ఇది ఎక్స్ఛేంజీలో లిస్టవగా.. ఒక్కో లాట్ కింద కనీసం 1200 షేర్లు ఓపెన్ చేయాల్సి ఉంటుంది. అంటే దీనికి పెట్టుబడి రూ. 1.27,200 గా ఉంది. ఇక లిస్టింగ్ రిటర్న్స్ చూస్తే 187 శాతానికిపైగా లాభం అంటే ఏకంగా రూ. 2,38 లక్షల మేర లాభం వచ్చింది. మొత్తం పెట్టుబడిని రూ. 3.65 లక్షలు చేసింది. టీఏసీ ఇన్ఫోసెక్ కంపెనీ విషయానికి వస్తే ఇది 2016 లో ప్రారంభమైంది. సైబర్ సెక్యూరిటీ క్వాంటిఫికేషన్, పెనెట్రేషన్ టెస్టింగ్, వెల్నరబులిటీ మేనేజ్‌మెంట్, అసెస్‌మెంట్‌కు సంబంధించి రిస్క్ బేస్డ్ సొల్యూషన్స్ అందిస్తుంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బంధన్ బ్యాంక్, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ-గవర్నెన్స్ వంటి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, రెగ్యులేటర్లు దీనికి క్లయింట్లుగా ఉన్నాయి.

**స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి.**

**ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది.**

# బంగారం ధర ఎప్పుడు తగ్గుతుంది? నిపుణులు ఏమంటున్నారు?

బంగారం ధరలు రోజు రోజు భారీగా పెరుగుతున్నాయి. రెండు రోజుల్లో తులం బంగారం రూ. 1300 పైన పెరిగింది. ప్రస్తుతం గ్రాము గోల్డ్ రేటు 7 వేల పైనే ఉంది. మరి ఈ సమయంలో బంగారం కొనుగోలు చేయడం మంచిదేనా? బంగారాన్ని నగల రూపంలో కొంటే బెటరా లేదా బాండ్స్ రూపంలో కొనడం మంచిదా? బంగారం ధరలు పెరిగేందుకు కారణాలేంటి, ఈ పసిడి ధరలు ఎప్పుడు తగ్గుతాయి? ధరలు తగ్గే వరకు వేచి చూడడం మంచిదేనా? బులియన్ మార్కెట్ నిపుణులు ఏమంటున్నారు అనేది ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. ఇటీవలి కాలంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధర పెరగుదలతో పోలిస్తే.. తగ్గడం చాలా స్వల్పంగా ఉంది. ఆర్థిక అనిశ్చితి, స్టాక్ మార్కెట్లలో ఒడుదొడుకుల వంటి కారణాలతో పెట్టుబడిదారులు బంగారాన్ని భద్రమైన సాధనంగా భావిస్తున్నారు. గోల్డ్ రేట్ల పెరుగుదల వెనుక అంతర్జాతీయ పరిణామాలుఉంటాయి. ప్రపంచ ప్రధాన మార్కెట్లలో లండన్ బులియన్ మార్కెట్ ఒకటి. ధరలను నిర్ణయించేది ఈ మార్కెట్టే. పెద్ద పెద్ద మైనింగ్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు ఈ సంస్థలో ఉన్నారు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర 2,256 డాలర్ల స్థాయిలో ట్రేడింగ్ అవుతోంది. 2023 నాటి గరిష్ఠ ధరతో పోలిస్తే 8 శాతం ఎక్కువ. భారత కరెన్సీ విలువ సైతం పడిపోవడం గోల్డ్ ధరలు పెరిగేందుకు కారణమవుతోంది. ప్రతి ఏడాది భారత్ కు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతుంటుంది.

అమెరికాలో ఆర్థిక సంక్షోభం ధరల పెరుగుదలకు మరో కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

గత 20 ఏళ్ల కాలాన్ని గమనించినట్లయితే బంగారం ధరలు క్రమం తప్పకుండా పెరుగుతున్నాయి. దీనికి కారణం దాని డిమాండ్ పెరగడమే. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, ఎన్నికల వాతావరణం, డొనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయన్న ఊహాగానాలు, రాజకీయ పరమైన మార్పులు సైతం బంగారం పెరిగేందుకు కారణమవుతున్నాయి. బంగారం ధర ఎప్పుడు తగ్గొచ్చు? బంగారం ధరల పెరుగుదల 2025 వరకు కొనసాగే అవకాశం ఉందని జేపీ మోర్గాన్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు అంచనా వేస్తున్నాయి. అంటే ఈ ఏడాదంతా ధరలు పెరిగే అవకాశాలే ఉన్నాయని అర్థమవుతోంది. వచ్చే ఏడాదిలో కాస్త ఊరట లభించవచ్చు. బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్న క్రమంలో పసిడిపై పెట్టుబడి పెడితే మంచి రాబడి వచ్చే అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయితే, నగలు లేదా బంగారు నాణాలు కొనుగోలు చేస్తే మొత్తం ధరలో తరుగు కమిషన్ కింద 20 శాతం పోతుంది. అంటే మీరు రూ.100 పెట్టి బంగారం కొంటే దాని అసలు విలువ రూ.80 మాత్రమే. అదే గోల్డ్ బాండ్ కొనుగోలు చేస్తే నెల నెలా వడ్డీ వస్తుంది. బాండ్స్ పోతాయనే భయం ఉండదు. డిజిటల్ గోల్డ్ ద్వారా 4 కిలోల వరకు కొనుగోలు చేయవచ్చు. వాటిపై పన్ను మినహాయింపులు సైతం లభిస్తాయి.

# అదరగొట్టిన హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు.. వరుసగా 7వ రోజు లాభాలే..




హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు తమ ఇన్వెస్టర్లపై కాసులు కురిపిస్తున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాపడ్డాయి. గత వారం రోజుల్లో 6 శాతానికిపైగా పెరిగాయి. నష్టాల నుంచి ఇక తేరుకున్నట్లేనా? ఇప్పుడు షేర్లు పెరిగేందుకు గల కారణాలేంటి? ఓసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు అదరగొడుతున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏప్రిల్ 5వ తేదీన ఈ బ్యాంక్ స్టాక్ 1.5 శాతం మేర లాభంతో ట్రేడింగ్ అవుతోంది. ఈ వార్త రాసే సమయానికి దేశీయ అతిపెద్ద బ్యాంక్ షేర్లు 1.55 శాతం లాభంతో రూ.1551.65 వద్ద కొనసాగుతున్నాయి. అంతకు ముందు రోజు సెషన్‌లో ఈ షేర్లు 3 శాతం మేర లాభపడిన సంగతి తెలిసిందే. అలాగే గత 5 ట్రేడింగ్ సెషన్లలో చూసుకుంటే ఈ బ్యాంక్ షేర్లు సుమారు 6 శాతం మేర లాభపడ్డాయి. అలాగే గత ఏడు వరుస సెషన్లో 8 శాతం మేర పెరిగాయి. మరోవైపు.. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో మూడో త్రైమాసిక ఫలితాల ప్రకటన అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయి. ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగిల్చాయి. అయితే, మళ్లీ క్యూ4 ఫలితాలపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ అందుతున్న క్రమంలోషేర్లు రాణిస్తుడడం గమనార్హం. ఈ క్రమంలోనే షేర్లపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇచ్చాయి జెఫ్పెరీస్ అండ్ మక్వారీ వంటి చాలా బ్రోకరేజీ సంస్థలు. దీంతో మదుపరులు ఈ షేర్లు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, వరుస సెషన్లలో లాభాల్లో కొనసాగుతున్న క్రమంలో ఇక ముందు ముందు అదే ట్రెండ్ కొనసాగుతందని చెప్పేందుకు లేదు. ఏప్రిల్ 20వ తేదీన క్యూ4 ఫలితాలు ప్రకటించనుంది. ఆ తర్వాత స్టాక్ ఇదే పాజిటివ్ ట్రెండ్‌లో కొనసాగకపోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి 1757.50 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్తాయి 1363. 55 వద్ద ఉంది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉంది. పీఈ రేషియో 17.35 శాతం, డివిడెండ్ యీల్డ్స్ 1.23 శాతంగా ఉన్నాయి.

# లక్ష పెడితే రూ.15 లక్షలు..

ప్రముఖ లాజిస్టిక్ కంపెనీ స్టాక్ అదరగొట్టింది. గత వారం రోజులుగా వరుసగా అప్పర్ సర్క్యూట్‌లో లాక్ అవుతోంది. ఇన్వెస్టర్లకు కాసులు కురిపిస్తోంది. అంతే కాదు గత మూడేళ్లలోనే 1500 శాతం పెరిగి లక్ష పెట్టుబడికి రూ.15 లక్షలు లాభాలు అందించింది. అదే టైగర్ లాజిస్టిక్స్ ఇండియా కంపెనీ స్టాక్. గడిచిన ఆరు సెషన్లలో ప్రముఖ లాజిస్టిక్స్ కంపెనీ అయిన టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. వరుస సెషన్లలో అప్పర్ సర్క్యూట్ కొడుతోంది. అలాగే గత మూడేళ్లలో 1500 శాతం పెరిగి మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించింది. లక్ష రూపాయలకు రూ. 15 లక్షలు లాభాలు ఇచ్చింది. భారతీయ స్టాక్ మార్కెట్ల లో ఇటీవలి కాలంలో మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించిన స్టాక్స్ లో ఒకటిగా నిలిచింది. మార్చి 28, 2024 నుంచి వరుస సెషన్లలో ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్ కొడుతూ వస్తోంది. ఏప్రిల్ 5 వ తేదీ శుక్రవారం నాటి ట్రేడింగ్ చూసుకుంటే మార్కెట్లు ప్రారంభమైన కొద్ది సేపటికే బీఎస్ఈలో ఇంట్రాడే హై వాల్యూ రూ. 58.69 స్థాయిని తాకింది.

కొద్ది సేపటికే 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ లో లాక్ అయింది. సుమారు రూ. 5.65 కోట్ల సర్వీస్ ట్యాక్స్ సంబంధించి కంపెనీకి అనుకూలంగా నిర్ణయం వెలువడినట్లు తెలిసిన క్రమంలో ఈ షేర్లు రాణిస్తున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్ లో సర్వీస్ ట్యాక్స్ గురించి వెల్లడించింది కంపెనీ. 2023, జులై 14, 2022 ఫిబ్రవరి 10 న సర్వీస్ ట్యాక్స్ డిమాండ్ నోటీసులు వచ్చాయని, ఇప్పుడు వాటికిసంబంధించిన నోటీసులపై అనుకూల నిర్ణయం వెలువడినట్లు తెలిపింది. రూ. 5.65 కోట్లలో రూ. 2.64 కోట్ల ట్యాక్స్ ఇప్పటికే చెల్లించినట్లు ట్యాక్స్ విభాగం తేల్చిందని పేర్కొంది. ఈ వార్త రాసే సమయానికి టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ షేరు 5 శాతం లాభంతో రూ. 58.69 వద్ద ట్రేడింగ్ అవుతోంది. గత 5 రోజుల్లోనే 21 శాతానికిపైగా పెరిగింది. ఈ కంపెనీ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 87 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్థాయి రూ. 33.75 వద్ద ఉంది. అలాగే కంపెనీ మార్కెట్ విలువ రూ.620 కోట్లుగా ఉంది. పీఈ రేషియో 51. 76 వద్ద ఉంది. ఈ స్టాక్ గత ఏడాది కాలంలో 56 శాతం లాభపడింది. అయితే, మూడేళ్లలో 1500 శాతం మేర పెరిగింది. అంటే మూడేళ్ల క్రితం లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు ఆ షేర్ విలువ రూ. 16 లక్షలకుపైగా ఉంటుంది. మూడేళ్లలోనే లక్షకు రూ. 15 లక్షలు లాభాలు వచ్చినట్లయింది.


# భారతీయులకు శుభవార్త చెప్పిన జపాన్..



విదేశీ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించి, ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా జపాన్.. తన వీసా విధానంలో మార్పులు చేసింది. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఈ-వీసాను ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా చాలా ఈజీగా వీసాలను పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద భారతీయులు సహా పలు దేశాల పౌరులకు వీసా అందజేస్తోంది. ఈ కార్యక్రమం 90 రోజుల వరకు పర్యాటక ప్రయోజనాల కోసం జపాన్‌కు ప్రయాణించాలనుకునే వారికి ఒకే ప్రవేశ స్వల్పకాలిక వీసాను అందిస్తుంది. అమెజాన్ సమ్మర్ స్పెషల్ ఎ స్ప్లిట్ ఇన్వర్టర్ ఏసీల ప్రారంభ ధర రూ. 25,990 మాత్రమే! ఎక్స్ఛేంజి డిస్కౌంట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. భారతీయుల సహా వివిధ దేశాల పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా జపాన్ 'ఈ-వీసా'ను ప్రారంభించింది. పాస్‌పోర్టులలో భౌతిక స్టిక్కర్ల అవసరం లేకుండా ఈ కొత్త విధానాన్ని జపాన్ తీసుకొచ్చింది. ఏప్రిల్ 1, 2024 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఈ కొత్త విధానం ద్వారా భారతీయ పర్యాటకులు ఆన్‌లైన్‌లోనే వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీఎఫ్ఎస్ గ్లోబల్ ద్వారా నిర్వహిస్తున్న జపాన్ వీసా అప్లికేషన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పర్యాటకుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో వీసా పొందినవారు జపాన్‌లో గరిష్ఠంగా 90 రోజులు ఉండటానికి అనుమతిస్తుంది. అయితే జపాన్‌లో ఎంట్రీకి మాత్రం ఒకే ఒక్కసారి అనుమతి ఉంటుంది. భారతీయులతో పాటు ఇండియాలో నివసిస్తున్న విదేశీయులు కూడా ఈ-వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆస్ట్రేలియా, బ్రెజిల్, కాంబోడియా, కెనడా, సౌదీ అరేబియా, సింగ్‌పూర్, దక్షిణాఫ్రికా, తైవాన్, యూఏఈ, యూకే, అమెరికాకు చెందిన పర్యాటకులకు కూడా ఎలక్ట్రానిక్ వీసాకు అర్హులే. ఈ దేశాలు లేదా ప్రాంతాల నివాసితులు, స్వల్పకాలిక వీసాల నుంచి మినహాయింపు పొందినవారు జపాన్ ఈ-వీసా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం... జపాన్ వీసా అధికారిక వెబ్‌సైట్ దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పొందుపరచాలి. ఫొటోలతో సహా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేయాలి. దరఖాస్తును సమర్పించడానికి తేదీని ముందుగా బుక్ చేసుకుంటే ఫీజు వివరాలు సహా అపాయింట్‌మెంట్ లెటర్‌తో కూడిన ఈ-మెయిల్ వస్తుంది. దరఖాస్తును అందజేసి.. నిర్ణయం కోసం వేచిచూడాల్సి ఉంటుంది. వీసా అప్లికేషన్ స్టేటస్‌ని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. విజయవంతంగా ఎంపికైన దరఖాస్తుదారులకు ఎలక్ట్రానిక్ వీసా మంజూరు అవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, భౌతిక వీసా స్టిక్కర్‌లను జారీ చేయడం జరగదు. ప్రయాణ సమయంలో ఎయిర్‌పోర్టుల వద్ద చెక్-ఇన్ సమయంలో తమ డివైజ్‌లలోని వీసా చూపించాల్సి ఉంటుంది. ఈ-వీసాపై ఉన్న డిస్‌ప్లే ఆప్షన్ మీద క్లిక్ చేస్తే సరిపోతుంది.

# ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం..



ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ మంటలు క్రమంగా ఇతర ట్రాన్స్‌ఫార్మర్లకు వ్యాపించాయి. దీంతో భారీ ప్రమాదం జరిగింది. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. రాజధాని రాయ్‌పూర్‌లోని కోటా ప్రాంతంలో ఉన్న ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫారం పేలడంతో ఒక్కసారిగా భారీగా శబ్దంతోపాటు మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ మంటలు కాస్తా.. పక్కనే ఉన్న మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు అంటుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇక సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి.. ఫైర్ సిబ్బంది.. ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు వ్యాపించడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కూడా అలుముకుంది. వీలైనంత త్వరగా మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇక ట్రాన్స్‌ఫార్మర్ల పేలిన ఘటన జరిగిన సమయంలో కంపెనీలో కార్మికులు పని చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అందులో ఎందరు కార్మికులు ఉన్నారనేది అధికారులు ఆరా తీస్తున్నారు. వారి పరిస్థితి ఎలా ఉంది.. ఎవరైనా చనిపోయారా.. ఎవరికైనా గాయాలు అయ్యాయా అనే విషయాల గురించి ఇంకా ఎలాంటి సమాచారం అందించలేదు. ఇక ఈ ఘటనలో ఎంత ఆస్తి నష్టం సంభవించిందన్న వివరాలు తెలియాల్సి ఉంది.

# బర్త్ సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల మతం విడిగా నమోదు

గతేడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జనన మరణ నమోదు చట్టానికి కేంద్ర ప్రభుత్వ సవరణలు చేసి.. బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారింది. ఈ చట్టంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం.. అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. అయితే, ఇందులోని నిబంధనలకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాస్తవానికి చట్టం అమలుకు రాష్ట్రాల సమ్మతి తప్పనిసరి. ఇకపై జనన ధ్రువీకరణ పత్రాల్లో తల్లిదండ్రులు తమ మతం గురించి వ్యక్తిగతంగా నమోదుచేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 'కుటుంబ మతం' స్థానంలో తల్లి, తండ్రి విడిగా తమ మతం గురించి డిక్లరేషన్ ఇవ్వాలి. ఈ కొత్త నిబంధన కేంద్ర హెూంశాఖ నమూనా నిబంధనలకు అనుగుణంగా ఉంది. అయితే, ఇది అమల్లోకి వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసి, వాటి ఆమోదం తప్పనిసరి. దత్తత తీసుకునే తల్లిదండ్రుల కూడా మతాన్ని వ్యక్తిగతంగా నమోదు చేయాలి. జనన, మరణాల నమోదుకు జాతీయ స్థాయి డేటాబేస్ ఏర్పాటు చేయనున్నారు. ఆధార్ నంబర్లు, ఆస్తి రిజిస్ట్రేషన్లు, రేషన్ కార్డులు, ఎలక్టోరల్ రోల్స్, పాస్‌పోర్టులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్‌తో సహా అనేక ఇతర డేటాబేస్‌లను రిఫ్రెష్ చేయడానికి దీనిని సమర్థంగా ఉపయోగించనున్నారు. గత, వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో జనన మరణ నమోదు (సవరణ) చట్టం బిల్లు 2023కు ఉభయసభలు ఆమోదం తెలిపాయి. ఆగస్టు 1న లోక్‌సభలోనూ, 7న రాజ్యసభలోనూ ఆమోదించారు. అక్టోబర్ 2023 నుంచి విద్యా సంస్థలలో ప్రవేశం, డ్రైవింగ్ లైసెన్స్, ఓటు హక్కు, ఆధార్ నంబర్‌ను పొందడం, వివాహాలను నమోదు, ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందడం వంటి వివిధ ముఖ్యమైన సేవలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. 'జననాలు, మరణాల డేటాబేస్ రూపొందించడంలో ఇది సహాయపడుతుంది. ప్రజా సేవలు, సామాజిక ప్రయోజనాలు, డిజిటల్ రిజిస్ట్రేషన్‌లో సమర్థవంతమైన, పారదర్శకతకు సహకరిస్తుంది'అని హెూం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 'జనన మరణాల నమోదు (సవరణ) చట్టం, 2023 (20 ఆఫ్ 2023)లోని సెక్షన్ 1లోని సబ్-సెక్షన్ (2) ద్వారా దఖలుపడిన అధికారాలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 1 నుంచి చట్టంలోని నిబంధనలు అమల్లోకి వస్తాయని' అని నోటిఫికేషన్ పేర్కొంది.

# ప్రపంచ క్యాన్సర్ రాజధానిగా భారత్..



ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న కేన్సర్ మరణాల్లో దాదాపు సగం ధూమపానం, మద్యం సేవించడం, అధికబరువు వంటి కారణాలే కారణమని పలు అధ్యయనాల్లో వెల్లడయ్యింది. ఇక, దేశంలో కేన్సర్ భారినపడుతోన్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగతూ ఉండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న వయసు పిల్లలు సైతం దీని బారిపడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఏడాదికి 40 వేల నుంచి 50 వేల మంది చిన్నారులు మహమ్మారి బారిన పడేవారు.

కేన్సర్ వ్యాధిపై ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఏటా లక్షల మందిని ఈ మహమ్మారి బలితీసుకుంటోంది. ఇక, భారత్ కేన్సర్‌కు రాజధానిగా మారిపోయిందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. కేన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ), హృద్రోగం, మానసిక సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధులు తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా కేన్సర్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ప్రపంచ కేన్సర్ రాజధానిగా భారత్ తయారైందా? అన్న స్థాయిలో పరిస్థితి ఉందని పేర్కొంది. 'హెల్త్ ఆఫ్ ది నేషన్' పేరుతో అపోలో హాస్పిటల్స్ గురువారం విడుదల చేసిన నాలుగో వార్షిక నివేదికలో పలు సంచలన విషయాలు ఉన్నాయి. చిన్నపిల్లలు పలు అసాంక్రమిక వ్యాధుల బారినపడటం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని, దీనిని నివారించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని నివేదిక సూచించింది. కేన్సర్ విషయంలో కూడా ఇది కనిపిస్తోందని, ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో ఈ వ్యాధి బారినపడుతున్న వారి సగటు వయసు చాలా తక్కువగా ఉంటోందని వివరించింది. దేశంలో రొమ్ము, గర్భాశయం, ఊపిరితిత్తులు, నోటి కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతునప్పటికీ, నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం చాలా తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. అలాగే, స్థూలకాయం (ఒబిసిటీ) కూడా భారతీయ యువతలో పెరిగిపోతోందని, ఇది పలు అసాంక్రమిక వ్యాధులకు కారణమవుతోందని తెలిపింది.

అంతేకాదు, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ)ల ముప్పును పలువురు భారతీయులు ఎదుర్కొంటున్నారని వెల్లడయ్యింది. యువతలో మానసిక సమస్యలు ముఖ్యంగా కుంగుబాటు (డిప్రెషన్) అధికంగా కనిపిస్తోందని తేలింది. ఈ నివేదికపై అపోలో హాస్పిటల్స్ వైస్-ఛైర్మన్ డాక్టర్ ప్రీతా రెడ్డి మాట్లాడుతూ.. అసాంక్రమిక వ్యాధులను ఎదుర్కోవటానికి తక్షణం సమష్టి కార్యాచరణ అవసరమని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు వ్యక్తిగత స్థాయిలో చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఆవశ్యకత ఉందని చెప్పారు.

వైద్య చికిత్సలకు సంబంధించి మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని, వాటిని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని అపోలో సంస్థల ఛైర్మన్, సీఈఓ డాక్టర్ మధు శశిధర్ సూచించారు. ఈ మేరకు అపోలో 'ప్రో హెల్త్ స్కోర్' పేరుతో దేశంలోనే తొలి డిజిటల్ హెల్త్ కౌంటింగ్ టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా తమ ఆరోగ్యంపై స్వీయ అంచనాకు వచ్చి, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టటానికి అవకాశం లభిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఓ ప్రకటనలో తెలిపింది. అసాంక్రమిక వ్యాధులు దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.లక్షల కోట్ల మేర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో.. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ టూల్ ఎంతో ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.


# కోపాన్ని తగ్గించుకోవాలంటే ఇవి పాటించాల్సిందే..





కొంతమందికి ఊరికే కోపం వస్తుంది. కోపం వచ్చిన సమయంలో విచక్షణ కోల్పోతారు. అలాంటప్పుడు ఏం చేస్తామో ఏం తెలియదు. చాలా నష్టపోతారు. అలా కాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో తెలుసుకోండి. వీటి వల్ల చాలా హెల్ప్ అవుతుంది. ఒత్తిడిగా ఉన్నప్పుడు చాలా మందికి నెగెటీవ్ థాట్స్ వస్తుంటాయి. వాటిని వీలైనంతగా అవాయిడ్ చేయాలి. దీని వల్ల కోపం తగ్గుతుంది. మనస్సులో .. మీ మనస్సుని కంట్రోల్ చేయాలి. ఏవేవో ఆలోచనల కారణంగానే చాలా మందికి కోపం వస్తుంటుంది. అలాంటి ఆలోచనలు రాకుండా మనసుని కంట్రోల్ చేసే ప్రయత్నం చేయాలి. మ్యూజిక్.. మీ మనసుకి సంతోషాన్ని కలిగించే సంగీతాన్ని వినడం మంచిది. దీని వల్ల చాలా రిలాక్స్‌గా ఉంటుంది. కాబట్టి, కోపంగా ఉన్నా, మనసు బాలేకున్నా చక్కని సంగీతం వినండి. మంచి వాతావరణం.. ఒత్తిడి, కోపాన్ని తగ్గించడంలో మరో బెస్ట్ ఆప్షన్ పచ్చని ప్రకృతి. పచ్చని ప్రకృతిలో కాసేపు గడపడం వల్ల మనసు చాలా ప్రశాంతంగా ఉంటుంది. కోపం, ఒత్తిడి తగ్గుతుంది. ప్రతి ఒక్కరికి కూడా ఇష్టమైన కొంత మంది వ్యక్తులు ఉంటారు. మీ మనసు బాలేనప్పుడు వారితో టైమ్ స్పెండ్ చేయండి. వారితో మీ ఆలోచనలని పంచుకోండి. దీని వల్ల మనశ్శాంతిని అందించేందుకు హెల్ప్ చేస్తుంది. నిద్ర.. నిద్ర సరిగ్గా పోకపోవడం వల్ల కూడా ఒత్తిడి పెరుగుతుంది. కాబట్టి, హ్యాపీగా నిద్రపోండి. దీని వల్ల మనసు ప్రశాంతత అందుతుంది. రోజుకి కనీసం 8 గంటలు నిద్రపోవడానికి ప్రయత్నించండి. వర్కౌట్.. మీ మానసిక స్థితిని మెరుగ్గా చేయడం వల్ల ఎక్సర్‌సైజ్ బాగా హెల్ప్ చేస్తుంది. దీని వల్ల మన సమస్యలు చాలా వరకూ దూరమవుతాయి. కాబట్టి, రెగ్యులర్‌గా వర్కౌట్ చేయండి. యోగా.. మనస్సుని ప్రశాంతంగా చేయడంలో యోగా కీ రోల్ పోషిస్తుంది. కాబట్టి, యోగాని కూడా ఫాలో అవ్వండి. వీటన్నింటి వల్ల చాలా వరకూ మీరు కోపాన్ని తగ్గించుకోవచ్చు.





# గులాబీ రంగులోకి మార్చే చిట్కాలు..!

మన అందమైన ముఖంలో.. కళ్ల తర్వత ఆకర్షణీయంగా కనిపించేవి పెదాలు. అందమైన, మృదువైన, లేత గులాబీ రంగులో మెరవాలని అందరికీ ఉంటుంది. శరీరంలో వచ్చిన మార్పులను, వాతావరణంలోని మార్పులను పెదవులు ఇట్టే ప్రతిబింబిస్తాయి. శరీర చర్మం కన్నా అధరాలు మరింత సున్నితం. ఇక్కడ మెలనిన్ ఉత్పత్తి అధికమైనప్పుడు, డీహైడ్రేషన్, అలాగే ఎండ, దుమ్మూ, ధూళికి పెదవులు తీవ్రంగా ప్రభావితమవుతాయం టున్నారు నిపుణులు. పెదవుల సంరక్షణను నిర్లక్ష్యం చేస్తే.. నల్లగా, నిర్జీవంగా మారతాయి. నల్లగా మారిన పెదవులను.. తిరిగి గులాబీ రంగులలోకి తీసుకురావడానికి కొన్ని చిట్కాలు సహాయపడతాయి.

నిమ్మరసం, తేనెతో.. మీ పెదవులను తిరిగి మెరిపించడానికి.. తేనె, నిమ్మరసం సహాయపడతాయి. తేనె, నిమ్మరసాన్ని సమభాగాలుగా తీసుకుని మిక్స్ చేయండి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని పెదవులకు అప్లై చేయండి. నిమ్మరసం డార్క్ స్పాట్‌లను తేలికపరచడానికి సహాయపడుతుంది, తేనె చర్మాన్ని తేమగా, మృదువుగా మారుస్తుంది. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే.. గులాబీ రంగులో మెరిసే అదరాలు మీ సొంతం.

కీరా..కీరాను సన్న ముక్కలుగా కట్ చేసి.. మీ పెదవులపై సుమారు 10-15 నిమిషాలు ఉంచండి. కీరాలో నేచురల్ బ్లీచింగ్ గుణాలు ఉంటాయి. ఇది పెదవులపై పిగ్మెంటేషన్ తొలగించడానికి సహాయపడుతుంది.

గులాబీ రేకుల పేస్ట్.. ఫ్రెష్ గులాబీ రేకులను పేస్ట్ చేసి.. మీ పెదాలకు అప్లై చేయండి. దీన్ని 15 నిమిషాల పాటు ఆరనివ్వండి. గులాబీ రేకుల్లో సహజ సమ్మేళనాలు ఉన్నాయి, ఇవి పిగ్మెంటేషన్‌ను తొలగిస్తాయి.

ఆలివ్ ఆయిల్, షుగర్ స్క్రబ్ ఈ స్క్రబ్ తాయారు చేయడానికి.. కొంచెం చక్కెరలో ఆలివ్ ఆయిల్ నూనెను మిక్స్ చేయండి. ఈ మిశ్రమంతో మీ పెదవులను సున్నితంగా స్క్రబ్ చేయండి. ఆ తర్వాత పెదవులు శుభ్రం చేసుకోండి. ఇది డెడ్ స్కిన్ సెల్స్ ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. మీ పెదవులను మృదువుగా చేస్తుంది, లేత గులాబీ రంగు అందిస్తుంది.

కలబందతో.. ఆరోగ్యం.. అందం.. రెండింటినీ కాపాడటంలో కీలకపాత్ర పోషించే కలబంద పెదవుల అందాన్ని రెట్టింపు చేయడంలోనూ కీలకపాత్ర పోషిస్తుంది. కొద్దిగా కలబంద గుజ్జు తీసుకొని పెదవులకు అప్లై చేసి కాసేపు మృదువుగా మర్దన చేసుకోవాలి. ఆ తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే పెదవులకు తగినంత తేమ అంది పొడిబారకుండా ఉంటాయి. పెదవులపై నలుపు కూడా తొలగుతుంది. తేనెతో.. రోజూ రాత్రి నిద్రపోయే ముందు పెదవులకు కొద్దిగా తేనె రాసుకోవాలి. మరుసటి రోజు ఉదయం చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల పొడిబారి నల్లగా మారిన పెదవులు తిరిగి మృదువుగా మారతాయి, దీనితో పాటు గులాబీ రంగుతో మరింత అందంగా కనిపిస్తాయి.





# ఈ ఆయిల్ రాస్తే మొటిమలు తగ్గి...

చర్మ సంరక్షణలో అవకాడో ఆయిల్ కూడా చాలా ముఖ్యమైనది. అందుకే ఈ ఆయిల్‌ని ఎన్నో క్రీమ్స్, మాయిశ్చరైజర్స్, సన్‌స్క్రీన్స్‌లో వాడతారు. ఈ ఆయిల్‌లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్స్ ఈ, ఎ, ఢి, లెసిథిన్‌లు ఉంటాయి. ఇవన్నీ కూడా చర్మంతో పాటు జుట్టుకి కూడా మంచిది. దీనిని వాడడం వల్ల పొడి చర్మం ఉన్నవారికి మరీ మంచిది.

హైడ్రేషన్.. విటమిన్ ఇ కాకుండా, ఇందులో పొటాషియం, లెసిథిన్ వంటి ఇతర పోషకాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా చర్మానికి పోషణ, తేమని అందిస్తాయి. ఇది చర్మ బయటి పొరలో పోషకాలను గ్రహించడంలో సాయపడుతుంది. కొత్త చర్మం ఏర్పడేందుకు సాయపడుతుంది. దీనిని రాయడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. ఈ ఆయిల్ వాడడం వల్ల మొటిమలు తగ్గుతాయి. అవకాడో ఆయిల్ ముఖానికి రాసి గోరువెచ్చని నీటితో క్లీన్ చేస్తే చర్మం తేమగా, జిడ్డుగా ఉండదు. కాబట్టి, మొటిమలు తగ్గిపోతాయి. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి. ఇది మొటిమలతో సంబంధం ఉన్న ఎరుపు, వాపుని తగ్గించడంలో సాయపడుతుంది.

గోళ్ళ ఆరోగ్యానికి.. అదే విధంగా ఈ ఆయిల్ రాయడం వల్ల గోళ్ళ చుట్టూ ఉన్న చర్మాన్ని మృదువుగా చేసి గోర్లు విరగకుండా చేస్తాయి. దీనిని అప్లై చేయడం వల్ల గోర్లు పెళుసుగా మారవు. అందుకోసం దీనిని గోర్లతో మసాజ్ చేయలి.

ఎండనుంచి రక్షణగా.. ఈ ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు సన్‌బర్న్ లక్షణాలను తగ్గిస్తాయి. 2011 అధ్యయనం ప్రకారం నూనెలోని విటమిన్ ఇ, బీటా కెరోటిన్, విటమిన్ డి, ప్రోటీన్, లెసిథిన్, కొవ్వు ఆమ్లాలు చర్మాన్ని నయం చేయడంలో సాయపడతాయి. కొన్ని అధ్యయనాల కారణంగా హానికరమైన యూవీ కిరణాల నుండి చర్మాన్ని కాపాడతాయి. ఈ ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్ పుష్కలంగా ఉన్నాయి. వీటి వల్ల తామర, సోరియాసిస్ వంటి చర్మ సమస్యల్ని తగ్గించేందుకు హెల్ప్ చేస్తాయి. అయితే, ఈ ఆయిల్ రాసే ముందు ప్యాచ్ టెస్ట్ చేయాలి.

యాంటీ ఏజింగ్.. ఇందులో హెల్దీ ఫ్యాట్స్ చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. దీనిని రాయడం వల్ల వృద్ధాప్య సంకేతాలు తగ్గి చర్మం మెరుగ్గా కనిపిస్తుంది. అయితే, దీనికి మరిన్ని పరిశోధనలు అవసరం. దీనిని ముఖానికి ఫేస్‌ప్యాక్‌లా రాయొచ్చు. లోషన్స్, క్రీమ్స్, జెల్స్‌లో కలిపి రాయొచ్చు. స్నానం చేసే ముందు మసాజ్ చేయొచ్చు. అవకాడో గుజ్జు తీసుకుని కూడా మీరు మసాజ్ చేయొచ్చు. రాత్రి పడుకునేటప్పుడు రాస్తే మంచిది. దీని వల్ల చర్మం పొడిబారకుండా మెరుస్తూ కనిపిస్తుంది. అయితే, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ చేయడం మంచిది.

# ఆకలి వేయట్లేదా.. మీ లివర్ ?





లివర్ మన శరీరంలో అతిపెద్ద అవయవం, అంతేకాదు కీలకమైనది కూడా. లివర్ మన శరీరంలో 500 పైగా పనులు నిర్వహిస్తుంది. ఇది మన శరీరం నుంచి విషాన్ని, హానికరమైన పదార్థాలను తొలగిస్తుంది. మన శరీరంలోని జీర్ణకోశ నాళం నుంచి వచ్చే రక్తాన్ని లివర్ ఫిల్టర్ చేస్తుంది. ఆహారం జీర్ణం చేయడానికి లివర్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఫ్యాటీ యాసిడ్స్ జీర్ణం కావటానికి సహాయపడుతుంది. ఆహారం జీర్ణం అయిన తర్వాత హార్మోన్, ఎంజైమ్, ప్రోటీన్, కొలెస్ట్రాల్‌ను తిరిగి శరీరానికి అందిస్తుంది. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా అవసరం. అయితే చాలా మంది దీని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. దీని ఆరోగ్యాన్ని పట్టించుకోకపోతే.. తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. లివర్ పనితీరు మందగిస్తే.. మొదట్లోనే కొన్ని సంకేతాలు చూపిస్తాయి. వీటిని ప్రాథమిక దశలోనే గుర్తించి.. చికిత్స తీసుకోవడం మంచిది.

ఆకలి మందగిస్తుంది.. మీ లివర్ పనితీరు మందగిస్తే.. ఆకలి తగ్గుతుంది. తినే విధానంలో మార్పులొస్తాయ్, ఇష్టమైన ఆహారాలపైనా విరక్తి పుడుతుంది. జీవక్రియ, జీర్ణక్రియలో లివర్ కీలకపాత్ర పోషిస్తుంది. లివర్ ఆరోగ్యం సరిగ్గా లేకపోతే.. ఆహారం తినాలనే కోరిక తగ్గుతుంది. మీకూ ఈ లక్షణం ఉంటే.. వైద్య నిపుణులను సంప్రదించడం మేలు.

వాంతులు.. లివర్ సమస్యలు ఉంటే.. వాంతులు, కళ్లు తిరగడం, కండరాల నొప్పి వంటి సమస్యలు ఎదురవుతాయి. కాలేయం శరీరం నుంచి వ్యర్థ పదార్థాలను, టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. లివర్ సరిగ్గా పనిచేయకపోతే.. రక్తప్రవాహంలో విషపదార్థాలు పేరుకుపోతాయ్. దీంతో వికారం, వాంతులు వంటి లక్షణాలు ఉంటాయి.







చర్మంపై బొబ్బలు, మచ్చలు.. పోర్ఫిరియా కుటానియా టార్డా అనే సమస్య ఉంటే.. సూర్యరశ్మికి గురైనప్పుడు చర్మంపై బొబ్బలు వస్తాయ్. కొన్ని ప్రొటీన్లు (పోర్ఫిరిన్లు) మీ లివర్ ఏర్పడి.. రక్తం, చర్మంలోకి వెళ్లడం వల్ల ఇది సంభవిస్తుంది. ఈ ప్రోటీన్లు మీ చర్మాన్ని చాలా సున్నితంగా చేస్తాయి, ప్రత్యేకించి మీరు ఎండలో ఉన్నప్పుడు. ఈ అదనపు పోర్ఫిరిన్ చర్మంలో పేరుకుపోతుంది, ఇది చర్మాన్ని సున్నితంగా మార్చి... బొబ్బలు, మచ్చలు ఏర్పడేలా చేస్తుంది.

మెడ నల్లబడిందా.. ఫ్యాటీ లివర్, లివర్ పనితీరులో లోపం, శరీరంలో అధిక ఇన్సులిన్ ఉత్పత్తి అవ్వడం వల్ల.. ఇన్సులిన్ నిరోధకత ఎదురవుతుంది. ఇది అకాంథోసిస్ నైగ్రికన్స్‌కు దారితీస్తుంది. దీని కారణంగా మెడ నల్లబడే అవకాశం ఉంది. రక్తం గడ్డకట్టదు.. రక్తం గడ్డకట్టడానికి అవసరమైన ప్రోటీన్లను ఉత్పత్తి చేయడంలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. లివర్ పనితీరులో లోపం ఉంటే.. రక్తం గడ్డకట్టే ప్రొటీన్‌లన్ను ఉత్పత్తి చేసే సామర్థ్యం తగ్గుతుంది. దీని కారణంగా చిన్న గాయాలు కూడా పెద్దగా మారతాయి. అంతేకాకుండా, గాయాల నుంచి ఎక్కువ కాలం రక్తస్రావం జరుగుతుంది.

# ఎక్కువ రోజులు ఫ్రెష్‌గా ఉంటాయ్..!

ఆకుకూరలు పోషకాల పవర్‌హౌస్. తోటకూర, పాలకూర, మెంతి, బచ్చలి, గోంగూర.. లాంటి ఆకుకూరల్లో పొటాషియం, మెగ్నీషియం, సోడియం, కాల్షియం, ఐరన్, ఫోలేట్, ప్రొటీన్లు, విటమిన్లు వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిలో ఉన్న ఫైబర్ జీర్ణక్రియకు తోడ్పడుతుంది. వీటిలోని సి, ఇ విటమిన్లు, బీటా కెరొటిన్ కంటిచూపును మెరుగుపరుస్తాయి, యాంటీఆక్సిడెంట్లు గాయాలను తగ్గిస్తాయి. అందుకే.. మన ఆహారంలో తరచూ ఆకుకూరలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తూ ఉంటారు. చాలామంది వారానికి సరిపడా ఆకుకూర ఒకేసారి కొనుక్కుంటూ ఉంటారు. అయితే, కొన్ని సార్లు ఫ్రిజ్‌లో పెట్టినా.. ఆకుకూరలు పాడవుతూ ఉంటాయి. కొన్ని సింపుల్ టిప్స్ ఫాలో అయితే, ఆకుకూరలను ఎక్కువ రోజులు స్టోర్ చేసుకోవచ్చు. అవేంటో ఈ స్టోరీలో చూద్దాం.

టవల్‌లో చుట్టండి.. ఆకుకూరలు త్వరగా పాడవ్వడానికి ముఖ్యమైన కారణం.. అధిక తేమ. మీరు ఆకుకూరలను స్టోర్ చేసుకోవడానికి, ముందుగా ఆకులు పొడిగా ఉండేలా చూసుకోండి. దెబ్బతిన్న, చెడిపోయిన ఆకులను క్లీన్ చేయండి. ఆ తర్వాత శుభ్రమైన క్లాత్‌లో చుట్టి రిఫ్రిజిరేటరలో పెట్టండి. ఇలా చేస్తే.. ఆకుకూరలు పాడవకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. న్యూస్ పేపర్ వాడండి.. మీరు ఆకుకూరలు కొన్న తర్వాత.. ముందుగా వాటిలోని చెడిపోయిన ఆకులను తీసి క్లీన్ చేయండి. ఆ తర్వాత, కాడలు కత్తిరించండి. వీటిని న్యూస్ పేపర్‌లో పెట్టి రోల్ చేయండి. ఈ రోల్‌ను జిప్-లాక్ బ్యాగ్‌లో ఉంచండి. సీల్ చేసే ముందు బ్యాగ్ నుంచి లోపల గాలి లేకుండా చూసుకోండి. ఈ బ్యాగ్‌ను రిఫ్రిజిరేటర్‌లో స్టోర్ చేయండి. ఇలా చేస్తే ఆకుకూరలు వారం అంతా ఫ్రెష్‌గా ఉంటాయి. పండ్లకు దూరంగా పెట్టండి.. యాపిల్స్, అరటిపండ్లు, కివీస్ వంటి పండ్లు ఇథిలీన్ గ్యాస్‌ను రిలీజ్ చేస్తాయి.



ఇది పండ్లు, కూరగాయలు సహజంగా పండించడానికి సహాయపడుతుంది. బచ్చలికూర ఎక్కువ రోజులు ఫ్రెష్‌గా ఉండాలంటే.. ఇథిలీన్ గ్యాస్ రిలీజ్ చేసే పండ్లకు దూరంగా గాలి చొరబడని కంటైనర్‌లో స్టోర్ చేయాలి. ఫ్రీజ్ చేయండి.. ఆకుకూరలు ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే.. ఆకులను కత్తిరించి జిప్ - లాక్ బ్యాగ్‌లో ఉంచండి. దీన్ని ఫ్రీజర్‌లో స్టోర్ చేయవచ్చు. ఇలా చేస్తే.. ఆకుకూరలు ఎక్కువకాలం పాటు తాజాగా ఉంటాయి.

# పీరియడ్స్‌లో వచ్చే నొప్పి మాయం..



ఆడవారికి పీరియడ్స్ టైమ్‌లో నొప్పులతో బాధపడతారు. అలాంటప్పుడు కొన్ని యోగాసనాలు సమస్యల్ని దూరం చేస్తాయి. అవి ఏంటో ఇప్పుడు చూద్దాం.

పీరియడ్స్ టైమ్‌లో చాలా మందిక శరీరంలో నొప్పులు వస్తుంటాయి. ఇలాంటప్పుడు యోగా సమస్యని తగ్గిస్తుంది. ముఖ్యంగా కొన్ని ఆసనాలు చేయడం వల్ల సమస్య చాలా త్వరగా తగ్గిపోతుంది.


అవేంటంటే.. బాలాసనం చేయడానికి ముందుగా వజ్రాసనంలో కూర్చోండి. తర్వాత రెండు చేతులని పైకి లేపి ముందుకు వంచండి కిందకి వంగుతూ నుదిటిని నేలకు తాకేలా రెండు చేతులని చాచాలి. ఇలా ఉండగలిగేంతసేపు ఉండాలి.

పాదాలను నేలపై చాచి కూర్చొడి. తర్వాత రెండు అరచేతులని నేలపై ఆనించి నడుముని కాస్త పైకి లేపాలి పెల్విక్ ప్రాంతాన్ని బలంగా చేయడానికి చేతులు, మడమలని బలంగా ఉంచాలి.

ఇలా చేయడం వల్ల గర్భాశయం రిలాక్స్ అవుతుంది. దీంతో రక్తప్రసరణ మెరుగవుతుంది. దీనిని ప్లాంక్ పొజిషన్ అని కూడా చేయొచ్చు. ఈ వర్కౌట్ చేతులు, కాళ్ల ఆధారంగా బరువుని బ్యాలెన్స్ చేస్తుంది. ముందుగా బోర్లా పడుకుని చేతులు, కాళ్ళ ఆధారంగా బరువుని పైకి లేపాలి. అలానే బరువుని బ్యాలెన్స్ చేయాలి. ఈ ఆసనాలు చేస్తే ఎముకలు బలంగా మారతాయి.

ముందుగా కాళ్ళని ముందుకు చాచి కూర్చోండి. తర్వాత చేతులతో పాదాలను పట్టుకుంటూ ముందుకు వంగండి. కానీ, తుంటిని, తొడలను వంచొద్దు. పాదాలను తాకేటప్పుడు కూడా శ్వాస పీల్చుకోవాలి. ఎక్కువసేపు ఇదే ఆసనంలో ఉండి సాధారణ స్థితికి రావాలి. ఇలా 5 నుంచి 10 సార్లు చేయాలి.









# నెహ్రూ జూపార్క్ టికెట్ ధరలు పెంపు..

హైదరాబాద్ నెహ్రూ జూపార్క్ సందర్శించాలనుకునే వారికి బ్యాడ్‌న్యూస్. జూపార్కులో ఎంట్రీ టికెట్ ధరలను పెంచారు. అలాగే లోపల సఫారీ, ట్రైయిన్ రైడ్, వెహికల్ పార్కింగ్ ఫీజులను కూడా పెంచారు. మార్చి 1 నుంచి పెరిగిన ధరలు అందుబాటులోకి వస్తాయని జూ పార్కు అధికారులు తెలిపారు.

హైదరాబాద్ నగరంలో చాలా చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయి. అందులో బహదూర్‌పురాలోని నెహ్రూ జూలాజికల్ పార్క్ ఒకటి. ఇక్కడికి ప్రతినిత్యం వేల మంది సందర్శకులు వస్తుంటారు. జూలోని రకరకాల జంతువులు, పక్షులు, సరీసృపాలను చూసి ఎంజాయ్ చేస్తుంటారు. అయితే జూపార్కును సందర్శించే వారికి ప్రభుత్వం బ్యాడ్‌న్యూస్ చెప్పింది.

జూ ఎంట్రీ టికెట్ ధర పెంచినట్లు క్యూరేటర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. చిన్నారులకు రూ. 50, పెద్దలకు రూ. 100 చొప్పున టికెట్ ధరలు నిర్ణయించారు. పార్క్ లోపల సఫారీ, ట్రైయిన్ రైడ్, ఫిష్ ఆక్వేరియం వెళ్లే ధరలు కూడా పెరిగినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన తెలంగాణ జూపార్కులు, పార్కుల అథారిటీ 13వ జనరల్ బాడీ సమావేశంలో పెంపు నిర్ణయం తీసుకున్నట్లు క్యూరేటర్ వెల్లడించారు. పెరిగిన ఈ ధరలు మార్చి 1 నుంచి అమలులోకి వస్తాయని చెప్పారు. పెరిగిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి.

# ఏటీఎం కార్డు తరహా చిప్‌తో కొత్త రేషన్ కార్డులు..




తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు సిద్ధమైంది. కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాల ద్వారా 1.50 లక్షల అప్లికేషన్లు వచ్చాయని సివిల్ సప్లయ్స్ అధికారులు వెల్లడించారు. కులగణన సర్వే, గతంలో వచ్చిన అప్లికేషన్లు అన్నీ కలిపి ఈ సంఖ్య 10 లక్షలకు చేరినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల మార్పుల కోసం 20 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని సమాచారం. మార్చి 1న లక్ష కొత్త కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న ఉమ్మడి జిల్లాలను మినహాయించి రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయితే కొత్త రేషన్ కార్డులు గతంలో మాదిరి కాకుండా.. స్మార్ట్ కార్డుల రూపంలో ఇవ్వాలని భావిస్తోంది. ఏటీఎం కార్డు తరహాలో ప్రత్యేక చిప్, యూనిక్ నెంబర్‌తో కార్డులు మంజూరు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. కార్డుల తయారీ కోసం షార్ట్ టెండర్ పిలిచే పనిలో సివిల్ సప్లయ్ అధికారులు నిమగ్నమయ్యారు. కార్డు నమూనా అప్రూవల్‌కోసం ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి వద్దకు ఫైల్ పంపినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే కార్డుల ప్రింటింగ్ ప్రక్రియను మొదలుపెట్టనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షలకు పైగా పాత రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా.. వారితో పాటుగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి కార్డులు ఇవ్వనున్నారు. పాతవి, కొత్తవి అన్నీ కూడా స్మార్ట్ చిప్‌తో కూడిన కార్డులు ఇవ్వాలని భావిస్తోంది. ఈ స్మార్ట్ రేషన్ కార్డుపై ఎవరి ఫొటోలు ఉండవని.. కేవలం ఆధార్ తరహాలో యూనిక్ నెంబర్ మాత్రమే ఉంటుందని సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ అధికారులు చెబుతున్నారు. ఏటీఎం కార్డు తరహాలో ప్రత్యేక చిప్‌తో ఉండే ఈ కార్డును తయారు చేయనుండగా.. స్వైప్ చేస్తే పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మెషిన్‌లో లబ్ధిదారుల పేర్లు, ఆధార్ నెంబర్లు, అడ్రస్, ఇతర వివరాలు డిస్ ప్లే కానున్నాయి. యూనిక్‌నెంబర్ ఎంటర్ చేసినా, కార్డును స్వైప్ చేసినా పీఓఎస్ మెషిన్‌లో వివరాలు వచ్చేలా రూపొందిస్తున్నారు. ఈ స్మార్ట్‌కార్డుతో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేస్తున్నారు.

# టన్నెల్ యాక్సిడెంట్.. రంగంలోకి 'మార్కోస్

టన్నెల్‌లో 15 అడుగుల ఎత్తులో10 వేల క్యూబిక్ మీటర్ల బురద ఉందని ఇంజినీర్లు అంచనా వేశారు. ఆ బురదను బయటికి తీసేందుకు కన్వేయర్ బెల్ట్‌కు మరమ్మతులు చేస్తున్నారు. సొరంగం చివరలో పైకప్పు నుంచి పెద్ద ఎత్తున మట్టి పడుతుండటం.. సొరంగం దిగువన 15 అడుగుల ఊబిలాంటి బురద ఉండటం, అక్కడ కారు చీకటి, సరైన గాలి లేకపోవటం సహాయ చర్యలకు ఆటంకం కలిగిస్తోంది. అధునాతన కెమెరాలు, పరికరాలు కూడా పని చేయటం లేదు. సొరంగంలో 12వ కి.మీ. దాటిన తర్వాత బురద, నీళ్లలో నడిచి వెళ్లాల్సి ఉండటంతో రెస్క్యూ టీమ్స్ ఇబ్బంది పడుతున్నాయి.

టన్నెల్‌లో సరిగ్గా 13.85 కిలోమీటర్ల పొడవున్న సొరంగం చివరి భాగంలో పైకప్పు కూలి ప్రమాదం చోటు చేసుకుంది. ఆ ప్రాంతంలో ప్రత్యేక బృందంతో అన్వేషించాలని ప్రభుత్వం భావిస్తోంది. కార్మికులను రక్షించేందుకు నేడు ఆపరేషన్ మార్కోస్ చేపట్టనున్నారు. నేల, నీరు, ఆకాశం... ఎక్కడైనా, ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా సహాయక చర్యలకు దిగే సత్తా ఉన్న ఇండియన్ మెరైన్ కమాండో ఫోర్స్ సభ్యులనే మార్కోస్‌గా పిలుస్తారు. కార్గిల్‌తోపాటు కశ్మీర్ తదితర ప్రాంతాల్లో ప్రతికూల పరిస్థితుల్లో ఫలితాలను సాధించిన చరిత్ర ఆ టీంకు ఉంది. మార్కోస్‌తో పాటుగా బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్(బీఆర్‌వో) కూడా రంగంలోకి దిగనుంది. గుట్టలు, పర్వత ప్రాంతాల్లో సొరంగాలు నిర్మాణం, నిర్వహణ రికార్డు బీఆర్వోకు ఉంది.

# బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి నిజంగా ఈ మాట అన్నారా..?

తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ వేళ మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ గ్రాడ్యుయేట్ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి చెందిన ఓ న్యూస్ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాను టికెట్ రూ.30 కోట్లు పెట్టి కొన్నానని.. తన గెలుపుకు సహకరించకుంటే తీవ్ర పరిణామాలుంటాయని బీజేపీ కార్యకర్తలను హెచ్చరించినట్లుగా ఓ పేపర్ కట్టింగ్ వైరల్ చేస్తున్నారు. అయితే ఆ పేపర్ కట్టింగ్ నిజమేనా..? అంజిరెడ్డి నిజంగా ఆ మాట అన్నారా..? ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.

తెలంగాణలో మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీతో పాటుగా.. నల్గొండ-వరంగల్-ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు రేపు పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ గ్రాడ్యుయేట్ బీజేపీ అభ్యర్థి అంజి రెడ్డికి చెందిన ఓ న్యూస్ క్లిప్పింగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రూ.30 కోట్లు ఇచ్చి బీజేపీ ఎమ్మెల్సీ సీటు కొన్నట్లు పేపర్ కట్టింగ్‌ను కొందరు వైరల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అందులో నిజమెంతో ఇప్పుడు తెలుసుకుందాం.

మెదక్-కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ టికెట్‌ను రూ. 30 కోట్లు ఇచ్చి తాను కొన్నట్లు బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి వ్యాఖ్యలు చూపిస్తున్న న్యూస్ క్లిప్పింగ్ వైరల్ అయింది. 'టికెట్ పుణ్యానికి ఇవ్వలేదు.. 30 కోట్లిచ్చా...!' అనే శీర్షికతో ఆ న్యూస్ క్లిప్పింగ్ కనిపించింది. 'ఎవరెవరు నాకోసం ప్రచారం చేయడం లేదో లిస్టు రాసుకుంటున్నా.. పోలింగ్ అయ్యాక ఒకొక్కడి తోలు తీస్తా. బీజేపీ కార్యకర్తలు నా కోసం ప్రచారం చేయకపోయినా సరే.. ఓటుకు రూ.2 వేలు పంచైనా గెలుస్తా. కిషన్ రెడ్డి, సంజయ్, లక్ష్మణ్‌కు 30 కోట్లు సింగిల్ పేమెంట్ చేసి టికెట్ తెచ్చుకున్నా... బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి మాస్ వార్నింగ్' అని వైరల్ పేపర్ కట్టింగ్‌లో పేర్కొన్నారు. 'ఇంత డైరెక్ట్‌గా, పబ్లిక్‌గా చెబుతున్నాడు. అయినా కూడా ఎక్కడ స్పందించని వ్యవస్థలు. అసలు భారతదేశంలో రాజ్యాంగం ఉందా ఉంటే అమలువుతుందా?' అని ఓ నెటిజన్ ఈ పోస్టును ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు.

అయితే వైరల్ న్యూస్ క్లిప్పింగ్ తప్పు అని మేం నిర్ధారించాం. అది ఎడిటెడ్ న్యూస్ క్లిప్పింగ్ అని గుర్తించాం. బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్సీ టికెట్



కొనుక్కున్నట్టు చూపిస్తున్న వార్త కథనాలు, సోషల్ మీడియా పోస్టులు ఏవి మాకు దొరకలేదు. పార్టీ నాయకులకు ఆయన వార్నింగ్ ఇచ్చారని చూపిస్తున్న విశ్వసనీయ సమాచారం కూడా దొరకలేదు. వైరల్ అవుతున్న క్లెయిమ్స్‌ను అంజిరెడ్డి సైతం తోసిపుచ్చారు. వైరల్ చిత్రం కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో జరిగిన గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ సమావేశంలో తీసినదిగా గుర్తించాం.

వైరల్ ఫోటోను అంజిరెడ్డి తన ఫేస్‌బుక్‌లో 2025 ఫిబ్రవరి 20న అప్‌లోడ్ చేశారు. 'ఇవాళ కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో జరిగిన గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమావేశంలో పాల్గొనడం జరిగింది.' అని ఆయన క్యాప్షన్‌లో రాశారు. అలాగే న్యూస్ క్లిప్పింగ్ బ్యానర్‌పై ఉన్న లింక్ మనుగడలో లేదని గుర్తించాం. గూగుల్, బింగ్‌లో వివిధ కీవర్డ్ సెర్చ్ నిర్వహించి.. తెలంగాణ న్యూస్ టుడే డైలీ ఈ-పేపర్ లేదా దాని వెబ్‌సైట్ ఎక్కడా లేదని కనుగొన్నాం.

వైరల్ వార్తా సంస్థ, అది ప్రచురిస్తున్నట్లు చూపిస్తున్న వార్తలు రెండూ ఉనికిలో లేవు. తెలంగాణ న్యూస్ టుడే డైలీ సంస్థ... న్యూస్ క్లిప్పింగ్‌ల ద్వారా వస్తున్న అన్ని క్లెయిమ్స్ ఎడిటెడ్‌గా గుర్తించాం. కాబట్టి వైరల్ క్లెయిమ్ తప్పు అని నిర్ధారించాం.

# హైదరాబాద్ అందుబాటులోకి మరో ఫ్లైఓవర్..



హైదరాబాద్ నగరవాసులకు మరో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. దీంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల నెరవేరింది. ఇప్పటివరకు ఆ మార్గంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనదారులు ఇక రయ్‌మంటూ దూసుకెళ్లవచ్చు. ఇక ఎప్పటినుంచో నిర్మాణంలో ఉన్న అంబర్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణం ఇప్పటికి పూర్తి అయింది. మహా శివరాత్రి సందర్భంగా ఈ అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వాహనదారులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే కింది భాగంలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

హైదరాబాద్ నగరవాసులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌పై ఎట్టకేలకు వాహనాలు పరుగులు పెట్టాయి. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశాలతో మహా శివరాత్రి పండగ నుంచి అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌పై వాహనాల రాకపోకలకు అనుమతి లభించింది. అయితే ఈ అంబర్‌పేట్ ఫ్లైఓవర్ పనులు దాదాపుగా పూర్తి కాగా.. దాని కింది భాగంలో కొన్ని పనులు మిగిలిపోయాయి. ఫ్లైఓవర్ కింద రోడ్డు నిర్మాణం, గ్రీనరీ, ఇతర సుందరీకరణ పనులు ఇంకా జరుగుతున్నాయి. కానీ పైన ఫ్లైఓవర్‌పై మాత్రం అని పనులు పూర్తి అయ్యాయి. దీంతో స్థానిక లోక్‌సభ ఎంపీగా ఉన్న కిషన్ రెడ్డి ఆదేశాలతో ఇవాళ్టి నుంచి అంబర్‌పేట్ ఫ్లైఓవర్‌పై వాహనాలు నడిచేందుకు అనుమతి లభించింది. ఇక దీనికి సంబంధించిన అన్ని పనులను పూర్తి చేసి.. త్వరలోనే అంబర్‌పేట్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం జరపనున్నారు.

అయితే అంబర్‌పేట్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం వరకు ఆగకుండా.. అప్పటివరకు ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పించేందుకు రాకపోకలకు అనుమతించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ నిర్మాణం అనేది స్థానికంగా ఉంటున్నవారికే కాకుండా ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు దశాబ్దాల నుంచి ఉన్న ఒక కల. తాజాగా ఈ అంబర్‌పేట్ ఫ్లైఓవర్ వాహనాల రాకపోకలకు అందుబాటులోకి రావడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈ మేరకు మంగళవారం అంబర్‌పేట్ ఫ్లైఓవర్ పనులను స్వయంగా కిషన్ రెడ్డి పర్యవేక్షించారు. దీంతో ఆయన ఆదేశాలతో నేటి నుంచి నగరవాసులకు ఈ అంబర్‌పేట్ ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చింది. గోల్నాక చర్చి నుంచి ఛే నంబర్, శ్రీ రమణ జంక్షన్ల మీదుగా నిర్మించిన 1.5 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మాణాన్ని సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి కిషన్ రెడ్డి పరిశీలించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ ఫ్లైఓవర్ విస్తరణ పనులు చేపట్టినా ఛే నంబర్- శ్రీరమణ చౌరస్తాల మధ్య ఉన్న శ్మశాన వాటికల కారణంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. అంతేకాకుండా దీని వల్ల జాతీయ రహదారిపై స్థానికులతోపాటు వరంగల్ వెళ్లే వాహనదారులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో.. తానే స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడి ఈ అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఇక ఈ అంబర్‌పేట్ ఫ్లైఓవర్ పూర్తయినా కింద సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఇంకా 6 చోట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ భూసేకరణ చేపట్టాల్సి ఉందని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. దానికి సంబంధించి.. రూ.2.51 కోట్ల నష్టపరిహారం చెక్కు అందుకున్నా.. అందుకు భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇంకా జాతీయ రహదారుల శాఖకు అప్పగించలేదని తెలిపారు. భూసేకరణ పూర్తి చేసి.. స్థలాన్ని అప్పగిస్తే పనులు త్వరగా పూర్తి చేస్తామని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

## దేంజర్‌లో ఐటీ ఉద్యోగుల ఆరోగ్యం..

84 శాతం మంది ఫ్యాటీ లివర్ సమస్యతో, 71శాతం మందిని ఊబకాయం, 34 శాతం మంది షుగర్, బీపీ సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది. ఎక్కువ సేపు ఒకే చోట కూర్చోవడం, నిద్రలేమి, పని ఒత్తిడి, పనివేళలు అనారోగ్య సమస్యలకు కారణాలుగా గుర్తించారు. చాలా మంది యువత కలల కొలువు ఐటీ ఉద్యోగం. ఐదంకెల జీతం, వారానికి రెండ్రోజులు వీకాఫ్, కార్పొరేట్ వర్క్ కల్చర్, హైఫై లఫ్. అబ్బో.. ఇలా చెప్పుకుంటే పోతే ఐటీ ఉద్యోగుల లైఫ్ స్టైల్ మాములుగా ఉండదు. అందుకే చాలా మంది ఐటీ ఉద్యోగాలు చేసేందుకు పోటీ పడుతుంటారు. అయితే ఇది నాణానికి ఒక వైపు మాత్రమే. కాయిన్ మరో వైపు తిప్పి చూస్తే కానీ తెలియదు.. ఐటీ ఉద్యోగులకు ఉండే వర్క్ ప్రెజర్, నైట్ షిఫ్టులు, జీవనశైలిలో మార్పులు. వీటి కారణంగా చాలా మంది ఐటీ ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

ఎంతలా అంటే.. దేశంలో ఐటీ, దాని అనుబంధ రంగాల్లో 54 లక్షల మంది పని చేస్తుండగా.. వారిలో 84% మంది ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్నట్లు తెలింది. మరో 71 శాతం మందిని ఊబకాయం, 34 శాతం మంది షుగర్, బీపీ తదితర సమస్యల బారిన పడే ప్రమాదంలో ఉన్నారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ స్కాలర్లు, ఓ ప్రైవేట్ హాస్పిటల్ చేసిన అధ్యయనంలో షాకింగ్ విషయాలు వెల్లడయ్యాయి. ఐటీ ఉద్యోగులు తీసుకునే ఫుడ్‌లో అధిక క్యాలరీలతో పాటు కూల్ డ్రింక్స్, శారీరక శ్రమ లేకపోవడంతోనే ఊబకాయం, కాలేయ జబ్బులు పెరుగుతున్నాయని గుర్తించారు. వారి జీర్ణక్రియ సక్రమంగా లేకపోవడంతో కాలేయ జబ్బులొస్తున్నాయని గుర్తించారు.

జూన్ 2023 నుంచి జూన్ 2024 వరకు 3,450 మందికి వైద్య పరీక్షలు చేయించగా కీలక విషయాలు వెల్లడయ్యాయి. హెల్త్ చెకప్ చేయించుకున్న ఐటీ ఉద్యోగుల్లో 84 శాతం మంది ఊబకాయం, ఫ్యాటీలివర్‌తో బాధపడుతున్నారు. మరో 5 శాతం మందికి కాలేయం చుట్టూ కొవ్వు పేరుకుపోయింది. 71 శాతం మంది యువకుల్లోనూ ఊబకాయం ఎక్కువగా ఉందని తేలింది. 34 శాతం మంది ఐటీ ఉద్యోగుల్లో జీర్ణక్రియ అపసవ్యంగా ఉందని గుర్తించారు. ఆహారం తక్కువగా తీసుకుంటున్నా.. వీరిలో చాలా మందిని అజీర్తి సమస్య వేధిస్తోంది. దీనికి అదనంగా 10 శాతం మంది షుగర్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ఒత్తిడి, పనివేళలు, ఎక్కువ సేపు ఒకే చోట కూర్చోవడం, నిద్రలేమి తదికర కారణాల వల్ల ఐటీ ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నట్లు తేలింది. ఇలా అయితే కష్టమేనని.. ఐటీ ఉద్యోగులు కాస్తంత శరీరాక శ్రమ చేయాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేదంటే తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొనే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు.

# ఈ ఏరియాలో భూముల ధరలకు రెక్కలు..!

హైదరాబాద్ ఓఆర్ఆర్ నుంచి ఫోర్త్ సిటీని కలుపుతూ రీజినల్ రింగు రోడ్డు వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ రహదారి నిర్మాణంపై కీలక అప్డేట్ వచ్చింది. రహదారి నిర్మాణానికి హెచ్‌ఎండీఏ టెండర్లు ఆహ్వానించింది. టెండరు దాఖలుకు గడువు ఈనెల 28 కాగా, వచ్చే నెల 21న టెండర్లు తెరవనున్నారు.

హైదరాబాద్ విస్తరణపై రేవంత్ సర్కార్ స్పెషల్ ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. ఫ్యూచర్ సిటీ పేరుతో ఫోర్త్ సిటీని ఏర్పాటు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్ పేట సమీపంలో ఈ సిటీని అభివృద్ధి చేస్తున్నారు. అక్కడే స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుండగా.. హైదరాబాద్ ఓఆర్ఆర్ నుంచి ఫ్యూచర్ సిటీలను కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. ఈ రహదారి నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పనుల కోసం టెండర్లను ఆహ్వానించింది. రెండు ప్యాకేజీల్లో ఈ రహదారి పనులు పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు.

ప్రస్తుత హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుని రావిర్యాల ఇంటర్‌ఛేంజ్ 13 నుంచి ఆమన్‌గల్



రీజనల్ రింగ్ రోడ్డు కనెక్ట్ చేస్తూ ఈ రహదారి నిర్మించున్నారు. మొత్తం 41.50 కి.మీ పొడవుతో ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రహదారి నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కి సైతం కొలిక్కి వచ్చింది. దీంతో రహదారి నిర్మాణానికి హెచ్‌ఎండీఏ టెండర్లు పిలిచింది. తొలిదశలో రావిర్యాల్ ఇంటర్ ఛేంజ్ నుంచి రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్ వరకు 19.2 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మిస్తారు. రెండోదశలో మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆమన్‌గల్ వరకు మొత్తం 22.30 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించనున్నారు.

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాలుతో పాటుగా.. 14 గ్రామాలను కలుపుతూ ఈ రహదారిని అందుబాటులోకి తీసుకున్నారు. తొలి దశ- 19.2 కి.మీకు మొత్తం వ్యయం- రూ.1,665 కోట్లు కాగా.. రెండో దశ- 22.30 కి.మీకు రూ.2,365 కోట్లు అంచనా వ్యయంగా నిర్ధారించారు. 100 మీటర్ల వెడల్పుతో యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మిస్తున్నారు. ఆరు లైన్ల మెయిన్ క్యారేజ్ వేను భవిష్యత్తులో 8 లైన్లుగా విస్తరించేందుకు వెసులుబాటుగా భూసేకరణ చేపట్టారు. ఆ మార్గంలో మెట్రో, రైల్వే కారిడార్ కోసం అటు ఇటు 20 మీటర్ల వెడల్పుతో భూమి రిజర్వు చేయనున్నారు. పచ్చదనం కోసం 2 మీటర్ల వెడల్పుతో సెంట్రల్ మీడియన్, ఇరువైపులా గ్రీన్‌బెల్ట్, సైకిల్ ట్రాక్, యుటిలిటీ కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. టెండర్ పత్రాలు ఫిబ్రవరి 28 నుంచి సమర్పించాలని.. మార్చి 21న సాంకేతిక బిడ్లు తెరవనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. కాగా, ఈ రహదారి నిర్మాణంతో ఆయా గ్రామాల్లో భూమలు ధరలకు రెక్కలు రానున్నాయి. ఇప్పటికే అక్కడ ఎకరం కోట్లలో పలుకుతుండగా.. మరింతగా పెరగనున్నాయి.

# రేవంత్ సర్కార్ శివరాత్రి కానుక.. అకౌంట్లలో డబ్బులు జమ...

శివరాత్రి పర్వదినాన రాష్ట్రంలోని నిరుపేద రైతు కూలీలకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం రిలీజ్ చేసింది. ఎన్నికల కోడ్ అమలులో లేని ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నిధులు విడుదల చేసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 83,420 మందికి రూ.50.65 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

శివరాత్రి పర్వదినాన తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని నిరుపేదల రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఏడాదికి రూ.12 వేలు రెండు విడతల్లో కూలీల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ఇవాళ ప్రభుత్వం రిలీజ్ చేసింది. ప్రస్తుతం 7 ఉమ్మడి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. ఆ జిల్లాలను మినహాయించి మిగిలిన ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి



మహబూబ్‌నగర్ జిల్లాల్లోని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేసింది. రిపబ్లిక్ డే పురస్కరించుకొని జనవరి 26న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రారంభించగా.. గ్రామ సభలు నిర్వహించి ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి అర్హులను గుర్తించారు. ఆ తర్వాత రైతు కూలీల ఖాతాల్లోకి రేవంత్ సర్కార్ నిధులు విడుదల చేసింది. తొలి విడతలో మొత్తం 18,180 మంది కూలీలకు రూ. 6 వేల చొప్పున డబ్బులు జమ చేసింది. అయితే ఆ తర్వాత గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు రావటంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో వివిధ పథకాలతో పాటుగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కూడా నిలిచిపోయింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లో లేని ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన రైతు కూలీల అకౌంట్లలో డబ్బులు జమ చేయాలని సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ఆయా జిల్లాల్లోని లబ్ధిదారులకు నేడు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి.

ఆ రెండు ఉమ్మడి జిల్లాల్లో దాదాపు 66,240 మంది రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున మొత్తం రూ.39.74 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 83,420 మంది ఉపాధి కూలీలకు 50.65 కోట్లు చెల్లించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులను ప్రభుత్వం చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే డబ్బులు పడిన వారు అకౌంట్లు చెక్ చేసుకోవాలని.. అర్హులైనా డబ్బులు జమ కానివారు మండల అధికారులను కలవాలని సూచించారు.



# ఆ విషయంలో మాత్రం నెం.1



'హిట్: ది థర్డ్ కేస్' టీజర్ యూట్యూబ్‌లో విడుదలైన 24 గంటల్లోనే 16 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది. మీడియం రేంజ్ హీరోలలో ఇదే హయ్యెస్ట్ అని నాని ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' మూవీ తెలుగు టీజర్ రిలీజైన 13 రోజుల్లో 15 మిలియన్ల వ్యూస్ తెచ్చుకుంటే, 'హిట్ 3' సినిమా కేవలం ఒక్క రోజులోనే ఆ రికార్డును బీట్ చేసిందని అంటున్నారు. అయితే లైక్స్ విషయంలో మాత్రం నాని చిత్రం అఖిల్ అక్కినేని 'ఏజెంట్' టీజర్ రికార్డును బ్రేక్ చేయలేకపోయింది. దీంతో అయ్యగారే నెం.1 అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

ఇప్పటికైతే 'హిట్ 3' మూవీ టీజర్ 22 మిలియన్లకు పైగా వ్యూస్, 455K లైక్స్ తో యూట్యూబ్ ట్రెండింగ్ లిస్టులో టాప్ లో ఉంది. 'హిట్' యూనివర్స్‌లో భాగంగా ఈ చిత్రం రూపొందుతోంది. ఫస్ట్ పార్ట్ లో విశ్వక్ సేన్, 'హిట్ 2'లో అడివి శేష్ హీరోలుగా నటించారు. ఇప్పుడు థర్డ్ పార్ట్ లో నాని పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా థర్డ్ కేసుని డీల్ చేయబోతున్నాడు. ఆయన పాత్ర ఎలా ఉంటుందనేది టీజర్ లో శాంపిల్ గా చూపించారు. తొలి రెండు సినిమాల్లో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ కు ప్రాధాన్యత ఇస్తే, ఈ కేసులో మాత్రం హీరో క్యారెక్టరైజేషన్ ను ఎలివేట్ చేసినట్లు కనిపిస్తోంది. 'హిట్ 3' మూవీ టీజర్ లో 'యానిమల్' 'కిల్' 'మార్కో' సినిమాల రేంజ్ లో వైలెంట్ సీన్స్ కూడా పెట్టారు. ఒకరకంగా నాని నుంచి అసలు ఇలాంటి సన్నివేశాలను ఎవరూ ఊహించలేదు. అందుకే అతన్ని ఆదరించే ఫ్యామిలీ ఆడియన్స్ ఇలాంటి హింస, రక్తపాతాన్ని ఎలా తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఇందులో నాని సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా, యునానిమ స్ ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా మే 1, 2025న విడుదల చేస్తామని మేకర్స్.

## ప్రభాస్ పేరుతో ఊరు..

'బాహుబలి' సినిమాల తర్వాత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పాపులారిటీ వరల్డ్ వైడ్‌గా పాకింది. మేడమ్ టుస్సాడ్స్, లండన్ మ్యూజియంలలో మైనపు ప్రతిమ ఉన్న తొలి తెలుగు స్టార్ హీరో డార్లింగే. ఇండియాలో ఆయన్ను ఆరాధించే వాళ్ళు ఉన్నట్లే, ఇతర దేశాల్లోనూ ఫ్యాన్స్ ఉన్నారు. ప్రస్తుతం ఇండియన్ సినిమాలో అత్యధిక రెమ్యునరేషన్ తీసుకునే హీరోలలో ప్రభాస్ ముందు వరుసలో ఉంటారు. అయితే రెబల్ స్టార్ పేరిట ఒక గ్రామం ఉందన్న విషయం మీకు తెలుసా?. అది ఎక్కడ ఉంది? ఆ ఊరు విశేషాలేంటో మీరూ ఓ లుక్కేయండి.

రెబల్ స్టార్ ప్రభాస్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాలిన పనిలేదు. ఆయనకు ఇండియాలోనే కాదు, దేశ విదేశాల్లోనూ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. 'బాహుబలి' సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా మారిన డార్లింగ్.. 'బాహుబలి 2' చిత్రంతో గ్లోబల్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకున్నాడు. దాన్ని కాపాడుకునేలా భారీ ప్రాజెక్ట్స్ సెట్ చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. అయితే ప్రభాస్ పేరుతో ఏకంగా ఓ ఊరు ఉందనే సంగతి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

అవును.. మీరు విన్నది నిజమే. 'ప్రభాస్' పేరుతో ఓ విలేజ్ ఉంది. అది ఎక్కడో కాదు.. భారతదేశానికి పొరుగు దేశమైన నేపాల్ లోనే ఉంది. ఈ విషయం ఓ మోటో బ్లాగర్ కారణంగా తాజాగా బయటకు వచ్చింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆ వ్యక్తి.. నేపాల్ లో పర్యటిస్తున్నాడు. బైక్ రైడింగ్ చేస్తున్న అతనికి అనుకోకుండా 'ప్రభాస్' అనే పేరుతో ఊరు కనిపించింది. దీంతో షాకై వెంటనే తన కెమెరాలో బంధించాడు. వీడియో తీసి వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఇంకేముంది అది కాస్తా క్షణాల్లోనే నెట్టింట వైరల్ గా మారింది.

అయితే నేపాల్ లో ఆ ఊరికి 'ప్రభాస్' అనే పేరు ఎందుకు వచ్చిందనేది తెలియదు కానీ.. పక్క దేశంలో ఒక విలేజ్ కి టాలీవుడ్ హీరో పేరు పెట్టడం నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది చూసి డార్లింగ్ ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. తమ అభిమాన హీరో పేరుని నేపాలీలు తమ గ్రామానికి పెట్టుకున్నారంటూ ఈ వీడియోని ఫ్యాన్స్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఆ విలేజ్ విశేషాలు తెలుసుకోడానికి ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అసలు ఆ ఊరికి ప్రభాస్ అనే పేరు ఎలా వచ్చిందని ఇంటర్నెట్ లో తెగ సెర్చ్ చేస్తున్నారు. 'ప్రభాస్' అనే పదానికి భారతీయ భాషల్లో అనేక అర్థాలు ఉన్నాయి. నేపాల్ లో ఆ పేరుకి ఎలాంటి మీనింగ్ ఉందో మరి.

నిజానికి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కు నేపాల్ దేశంలోనూ ఫ్యాన్స్ ఉన్నారు. 'బాహుబలి 2', 'సలార్', 'కల్కి 2898 ఏడీ' సినిమాలు అక్కడ కూడా మంచి వసూళ్లను సాధించాయి. ప్రస్తుతం ఆయన మారుతి దర్శకత్వంలో 'ది రాజాసాబ్' అనే రొమాంటిక్ హార్రర్ థ్రిల్లర్ లో నటిస్తున్నాడు. అలానే హను రాఘవపూడి డైరెక్షన్ లో ఓ హిస్టారికల్ ఫిక్షన్ మూవీ చేస్తున్నాడు. దీనికి 'ఫౌజీ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇక సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్.. నాగ్ అశ్విన్ తో 'కల్కి 2' చిత్రాలు డార్లింగ్ లైనప్ లో ఉన్నాయి. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ప్రభాస్ ఓ సినిమా చేస్తారనే టాక్ నడుస్తోంది.

## రజనీకాంత్‌కి కథ చెప్పిన శ్రీకాంత్ అడ్డాల..





'కొత్త బంగారులోకం' చిత్రంతో డైరెక్టర్‌గా అవతారమెత్తారు శ్రీకాంత్ అడ్డాల. ఈ సినిమా సూపర్ హిట్ అయిన తర్వాత కూడా వెంటనే ఏ చిత్రం చేయలేదు శ్రీకాంత్. నాలుగేళ్ల గ్యాప్ తీసుకొని ఏకంగా మహేష్ బాబు-వెంకటేష్ లాంటి స్టార్ హీరోలతో 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే క్లాసిక్ చిత్రాన్ని తీశారు. అసలు మహేష్ బాబుతో ఇలాంటి సినిమా ట్రై చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే బాక్సాఫీస్ దగ్గర కూడా ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయింది. దాదాపు దశాబ్ద కాలం దాటిపోయినా ఇప్పటికీ టీవీలో, యూట్యూబ్‌లో ఈ చిత్రం చూస్తూనే ఉన్నారు ఆడియన్స్.


మరోవైపు ఈ సినిమాని మార్చి 7న రీరిలీజ్ కూడా చేస్తున్నారు. మరోసారి ఈ క్లాసిక్‌ని థియేటర్లో చూసేందుకు ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వేళ ఈ సినిమాకి సంబంధించిన ఓ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ కీలకపాత్ర కోసం సూపర్ స్టార్ రజినీకాంత్‌కి కథ నెరేట్ చేశారట శ్రీకాంత్ అడ్డాల. ఇది ఓ పాత ఇంటర్వ్యూ.. ఇందులో మీ జీవితంలో ఆడియన్స్‌కి తెలియని ఓ సీక్రెట్ గురించి చెప్పండి అంటూ యాంకర్ అడిగింది. దీంతో మైండ్ బ్లోయింగ్ విషయం చెప్పారు శ్రీకాంత్ అడ్డాల. "నేను సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు కథని రజినీకాంత్ గారికి చెప్పాను. అందులో మహేష్ బాబు-వెంకటేష్ తండ్రి పాత్ర కోసం రజినీ సార్ దగ్గరికి వెళ్లాను. ఈ విషయం బయట ఎవరికీ తెలీదు. వీళ్లిద్దరికీ తండ్రిగా రజినీ గారు ఉంటే బావుంటుందని అనిపించింది. రాఘవేంద్ర కళ్యాణ మండపం అని చెన్నైలో ఉంటుంది. అందులోనూ ఇలాంటి మంచి పాత్ర చేయాలని ఉంది అన్నారు. ఇక అన్నింటికంటే షాకింగ్ ఏంటంటే నేను కథ చెప్పడానికి వెళ్లి కూర్చుంటే ఆయనే వచ్చారు. కానీ నేను ఆయనని గుర్తుపట్టలేదు. ఆయన మాములుగా ఉన్నారు. మంచినీళ్లు కావాలా అన్నారు. నేను ఎవరో అనుకొని ఫర్లేదండి అన్నాను. ఒక మనిషిని చూసి నవ్వుతూ ముందు కెళ్లిపోయే క్యారెక్టర్ కదా.. ఒక రిక్షావోడి నుంచి కోటీశ్వరుడి వరకూ అందరూ ఆ పాత్రకి కనెక్ట్ అయిపోవాలి. పైగా నేను ఎలాగో పెద్ద హీరోలతో సాదాసీదాగా సినిమా చేస్తున్నాను.. సో తండ్రి పాత్రకి రజినీ గారిని ఎందుకు పెట్టకూడదు అనిపించి దిల్ రాజు గారిని అడిగాను. శంకర్ గారి ద్వారా ఆయన ఏదో రికమెండ్ చేయించారు.. కేవలం ఆరోగ్యం సహకరించకపోవడం వల్లే నేను చేయలేకపోతు న్నాను.. ఏమనుకోకండి అని రజినీ కాంత్ అన్నారు." అంటూ శ్రీకాంత్ అడ్డాల అన్నారు.

## భార్యతో విడాకుల పుకార్లు..




టాలెంటెడ్ యాక్టర్ ఆది పినిశెట్టి ఓవైపు సినిమాల్లో హీరోగా నటిస్తూనే, మరోవైపు విలన్ రోల్స్ తో అదరగొడుతున్నాడు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'అఖండ 2' చిత్రంలో విలన్ గా నటిస్తున్నాడు. అంతకంటే ముందుగా ఇప్పుడు 'శబ్దం' సినిమాతో హీరోగా ప్రేక్షకులను అలరించడానికి రెడీ అయ్యాడు. ఫిబ్రవరి 28న ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో తెలుగులో అగ్రెసివ్ గా ప్రమోషన్స్ చేస్తున్న ఆది.. లేటెస్టుగా ఓ ఇంటర్వ్యూలో తన పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడారు. తన భార్య నిక్కీ గల్రానీతో విడాకులు తీసుకోబోతున్నట్లు వచ్చిన రూమర్స్ పై స్పందించాడు.

"సినిమాల్లో చాలా క్యారెక్టర్స్ చేయడం వల్ల నటీనటులు సెన్సిటివ్ గా తయారవ్వరు. ఇంకా స్ట్రాంగ్ గా అవుతారు. డైలీ మేం రెండు వందల మందితో పని చేస్తుంటాం. మనకి అందరూ మర్యాద ఇవ్వాలని లేదు. సినీ లైఫ్ స్టైల్ లో చాలా స్ట్రాంగ్ అవుతాం. నిక్కీ గల్రానీ నేను విడాకులు తీసుకోబోతున్నట్లు వార్తలు చూసినప్పుడు నాకు షాకింగ్ గా అనిపించింది. అసలు సంబంధమే లేకుండా ఇలాంటి వార్తలు రాసాడు.. ఎవడు వీడు? అనుకున్నాను. ఏదైనా ఉంటే రాయడం వరకూ ఓకే. కానీ సంబంధమే లేకుండా రాసాడు కాబట్టి, అతనెవరో తెలుసుకోవాలని అనుకున్నాను. ఆ తర్వాత అతని అకౌంట్ లో ముందుటి వీడియోలు చూసి, అలాంటి వాళ్ళని పట్టించుకోకూడదు అనిపించింది. వాళ్ళకి అంత ఇంపార్టెంట్ ఇవ్వకూడ దు అనుకున్నాను. ఒక వ్యక్తి ఎక్కడో కూర్చొని ఏమీ తెలియకుండా ఒక విషయా న్ని చెప్పాడంటే, అతన్ని అతనే సీరియస్ గా తీసుకోవడం లేదని అర్థం. వాడ్ని మనం ఎందుకు సీరియస్ గా తీసుకోవాలని వదిలేసాను" అని ఆది పినిశెట్టి చెప్పాడు. అయితే ఇలాంటివి చూసినప్పుడు వెంటనే కాస్త బాధ కలుగుతుందని, కొన్ని నిమిషాల తర్వాత దాన్ని దాటేసి వచ్చేస్తామని ఆది అన్నారు. నిక్కీ గల్రానీ గురించి చెబుతూ.. "ఫస్ట్ తను నాకు మంచి ఫ్రెండ్. ఆ తర్వాత నా ఫ్యామిలీతో మంచి బాండింగ్ ఏర్పరచుకుంది. నిజంగానే వాళ్ళు ఆమెను ఇష్టపడ్డారు.. ఆమె కూడా వాళ్ళని అంతే లైక్ చేసింది. నిక్కీ చాలా రెస్పాన్సిబుల్ పర్సన్. తన పనేంటి? ఏమేమి చేయాలి అనేది చాలా నీట్ గా ప్లాన్ చేసుకుంటుంది. అదే సమయంలో చాలా సరదాగా ఉంటుంది. ఇద్దరం కలిసి చాలా ట్రావెల్ చేసాం. జీవిత భాగస్వామిగా కంటే ఒక ఫ్రెండ్ తో ఉంటున్న ఫీలింగ్ వస్తుంది. ఇలాంటి విషయాలే మమ్మల్ని జీవితంలో మరో అడుగు వేయడానికి కారణమయ్యాయని అనుకుంటా" అని ఆది చెప్పుకొచ్చాడు.



## లైట్ తీసుకోమని చెప్పా



సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ హీరోగా నటించిన సినిమా 'యానిమల్'. 2023 డిసెంబర్ లో రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. వరల్డ్ వైడ్ గా రూ. 900 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. అయితే బ్లాక్ బస్టర్ హిట్టయిన ఈ సినిమాపై కొందరు బాలీవుడ్ సినీ ప్రముఖులు, క్రిటిక్స్ తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. వైలెన్స్ మరీ ఎక్కువైందని, మహిళలను తక్కువ చేసి చూపించారంటూ సందీప్ వంగాపై ట్రోల్స్ చేసారు. అదే సమయంలో హీరో రణబీర్ ని మాత్రం మెచ్చుకున్నారు. దీనిపై దర్శకుడు తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. బాలీవుడ్ ప్రముఖులపై కీలక వ్యాఖ్యలు చేసాడు.

"యానిమల్ సినిమాని ఫిలిం ఇండస్ట్రీ జనాలే చాలా బ్యాడ్ గా విమర్శించారు. కానీ రణబీర్ కపూర్ ను మాత్రం మెచ్చుకున్నారు. నేను రణబీర్ మీద జెలసీ ఫీల్ అవ్వడం లేదు. కానీ విషయం ఏమిటంటే రణ్‌బీర్ తెలివైన వ్యక్తే .. మరి రైటర్, డైరెక్టర్ పరిస్థితేంటి? నాకు ఈ తేడా అర్థం కాలేదు. వాళ్లంతా రణబీర్ తో కలిసి పని చేయాలనుకుంటున్నారని నాకు క్లియర్ గా అర్థమైంది. నేను ఈ ఇండస్ట్రీకి కొత్త కాబట్టి నన్ను విమర్శించడం చాలా ఈజీ. ఒక ఫిలిం మేకర్ రెండు మూడు సంవత్సరాల్లో ఒక సినిమా మాత్రమే చేయగలడు. అదే యాక్టర్ అయితే ఐదు సినిమాల్లో కనిపిస్తాడు. అక్కడ ఎక్కువ పని ఉంటుంది కాబట్టి అతన్ని ఏమీ అనరు. ఇది నిజం" అని సందీప్ వంగా అన్నారు.

"తెలుగు ఇండస్ట్రీ నుంచి వచ్చారు కాబట్టి, బాలీవుడ్‌లో అవుట్ సైడర్ గా ట్రీట్ చేస్తున్నారా?" అని ప్రశ్నించగా.. "అలా ఏమీ లేదు. అవుట్ సైడర్, ఇన్సైడర్ అనేది నేను అసలు నమ్మను. నేనెప్పుడూ అవుట్ సైడర్ లా భావించలేదు. ఎవరైనా సినిమా తీయొచ్చు. కానీ ఇక్కడ గ్యాంగ్, అసమానతలు ఉన్నాయనేది స్పష్టమైంది. ఎక్కడైనా అలానే ఉంటుంది. నువ్వు ఎల్కేజీ నుంచి ఒక స్కూల్ లో చదువుతున్నప్పుడు, నేను తొమ్మిది లేదా పదో తరగతిలో జాయిన్ అయినప్పుడు నువ్వు సీనియర్ అనే అనుకుంటావ్ కదా? ఇదీ అలాంటిదే" అని సందీప్ సమాధానమిచ్చాడు. తాను డైరెక్ట్ చేసిన 'కబీర్ సింగ్' సినిమాలో నటించాడనే కారణంతో ఒక నటుడికి ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ అవకాశం ఇవ్వలేదని తెలిపాడు.

"కబీర్ సింగ్ సినిమాలో నటించిన పాపులర్ యాక్టర్ ఒకరు.. బాంబేలో ఓ పెద్ద ప్రొడక్షన్ కంపెనీకి ఆడిషన్ ఇవ్వడానికి వెళ్ళారు. 'నువ్వు కబీర్ సింగ్ మూవీలో ఉన్నావ్ కదా.. మేము నిన్ను తీసుకోవడం లేదు' అని చెప్పి పంపించేశారు. అతను నాకు ఫోన్ చేసి చెప్తే లైట్ తీసుకోమని చెప్పా. వెనక్కి వెళ్లి సందీప్ తో రణబీర్ కపూర్ వర్క్ చేస్తున్నాడని చెప్పమని చెప్పా. ఇప్పుడు వాళ్ళు రణబీర్ కపూర్ కి చెప్తారా? త్రిప్తిని, రష్మికని తీసుకోవద్దని.. విశాల్ మిశ్రాని తీసుకోవద్దని చెప్పగలరా?. ఇలాంటివి నాకు చాలా చిరాకుగా అనిపిస్తాయి. అసలు వాటిని మాటల్లో చెప్పలేను. ఆ యాక్టర్ ఎక్కడి నుంచో వచ్చి నా సినిమాలో నటించి అంతో ఇంతో గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇంకా ముందుకు వెళ్లాలని ఆడిషన్ కి వెళ్తే, నా సినిమాలో వర్క్ చేస్తే తీసుకోనని పంపించేశారు. ఆ ప్రొడక్షన్ కంపెనీ 'అవతార్' సినిమా ఏమీ తీయడం లేదులే.. నువ్వు లైట్ తీసుకో అని చెప్పా" అని సందీప్ చెప్పుకొచ్చాడు.

## ఇక సినిమాలకు విరామం ఉండదు

తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న భామల్లో స్టార్ నటి సమంత ఒకరు. అయితే, సామ్ గత కొంతకాలంగా గడ్డుపరిస్థితుల్ని ఎదుర్కొంటోన్న విషయం తెలిసిందే. నాగ చైతన్యతో విడాకుల అనంతరం కొద్దిరోజులకే మయోసైటిస్ బారిన పడింది. దాన్నుంచి కోలుకునేందుకు సినిమాలకు లాంగ్ బ్రేక్ ఇచ్చింది. ఇంతలోనే తన తండ్రి జోసెఫ్ ప్రభు హఠాత్తుగా మరణించడం.. తన మాజీ భర్త రెండో పెళ్లి చేసుకోవడం సామ్‌ను తీవ్రంగా బాధించాయి. వీటన్నింటి నుంచి తేరుకుని ఇప్పుడిప్పుడే.. మళ్లీ తిరిగి తన వర్క్‌లైఫ్‌లో బిజీగా మారింది. వరుణ్ ధావన్‌తో కలిసి 'సిటాడెల్ : హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లో మెరిసిన సమంత.. ప్రస్తుతం రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్న వెబ్ సిరీస్ 'రక్త్ బ్రహ్మాండ్' షూట్‌లో జాయిన్ అయింది.

ఈ నేపథ్యంలో కొంతకాలం విరామం తర్వాత మళ్లీ సినిమాల్లోకి రావడం పట్ల సమంత స్పందించారు. ఇకపై విరామం తీసుకోనని ప్రకటించారు. యాక్టింగ్ తన ఫస్ట్ లవ్ అని పేర్కొన్నారు. 'సినిమాలు నా మొదటి ప్రేమ. నేను ఇకపై నటనకు విరామం తీసుకోను. ఇప్పటికే చాలా గ్యాప్ ఇచ్చాను. తిరిగి మీ సామ్ మీ ముందుకు వరుస చిత్రాలతో వస్తుంది' అని ప్రకటించింది. ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్' పూర్తి చేసే పనిలో ఉన్నట్లు తెలిపింది. ఆ తర్వాత మరో చిత్రం కూడా రెండు నెలల్లో సెట్స్ మీదకు వెళ్తుందని పేర్కొంది. కాగా, విజయ్ దేవరకొండతో చివరగా ఖుషి సినిమాలో నటించింది సమంత. ఈ సినిమా తర్వాత తెలుగులో మళ్లీ కొత్త ప్రాజెక్టు ప్రకటించలేదు. ప్రస్తుతం తన కొత్త వెబ్ సిరీస్ వెబ్ సిరీస్ షూట్‌లో జాయిన్ అయింది.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570